

విశాఖను గుండెల్లో పెట్టుకుంటాం



గాజువాక శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని



గాజువాక శంఖారావం సభలో లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఇతర నాయకులు

గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎదురుగాలి వీచినా తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాల్లో టీడీపీని గెలిపించారు



ఉత్తర నియోజకవర్గం శంఖారావం సభలో ప్రతిజ్ఞ చేస్తున్న నారా లోకేశ్, గంటా శ్రీనివాసరావు, శ్రీభరత్, దువ్వారపు రామారావు, ఉషాకిరణ్ తదితరులు

- టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగు నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- జాతీయ రహదారిపై ఫుట్ బ్రిడ్జిలు నిర్మిస్తాం
- కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- నిరు పేదలకు ఇళ్లు నిర్మిస్తాం
- అగనంపూడి టోల్‌గేట్ ఎత్తివేతకు కృషి
- 'నార్త్' వైసీపీ ఇన్‌చార్జి రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు
- గాజువాకలో భారీ వాహనాల మళ్లింపునకు కారిడార్

శంఖారావం సభల్లో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):
గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎదురుగాలి వీచినా విశాఖ నగరంలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో తెలుగుదేశాన్ని గెలిపించారని...ఈ నాలుగు సెగ్మెంట్‌లనూ తమ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. 'శంఖారావం' యాత్రలో భాగంగా సోమవారం ఆయన ఉత్తర నియోజకవర్గ పరిధిలోని బిర్లా జంక్షన్, గాజువాక నియోజకవర్గ ... మిగతా 6వ పేజీలో

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

దీర్ఘకాలిక ప్రయోజనాలు ముఖ్యం



పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలోకి చేరికలు...

- ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి
- ఈసారి అధికారంలోకి రావాలనే కూటమిగా వెళుతున్నాం
- కొన్ని త్యాగాలు తప్పవు
- ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తాం
- ఏదైనా ఉంటే నాతోనో, రాజకీయ వ్యవహారాల కమిటీతోనే చర్చించండి
- పార్టీ నేతలతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- పర్యటన ముగించుకొని రాజమండ్రికి పయనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):
ఇది చాలా కీలకమైన సమయమని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలని పార్టీ నాయకులకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో పార్టీ నాయకులు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో విడివిడిగా మాట్లాడారు. ఈసారి అధికారంలోకి రావాలనే ధ్యేయంతో కూటమిగా కలిసి వెళుతున్నామని, ఈ నేపథ్యంలో కొన్ని త్యాగాలు తప్పవని సూచనప్రాయంగా చెప్పారు. ఎక్కడైనా ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే...భవిష్యత్తులో వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసంతృప్తితోనో, వేరే విధంగానో పార్టీ గురించి ఎక్కడా బయట మాట్లాడవద్దని సూచించారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇంకా నిర్ణయం కాలేదని స్పష్టంచేశారు. ఎవరికైనా అనుమానాలు, అసంతృప్తి ఉంటే వాటిని బయట మాట్లాడవద్దని, నేరుగా తన దృష్టికే తీసుకురావాలన్నారు. తాను అందుబాటులో లేనిపక్షంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఉందని, వారితో చర్చించాలని సూచించారు. అంతే తప్ప పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరించవద్దని కోరారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశం ముగిసిన తరువాత విశాఖ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురిని జనసేన పార్టీలో చేర్పించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన ... మిగతా 6వ పేజీలో



సాగర తీరంలో చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు... తిలకిస్తున్న ప్రజలు

ఉత్సాహంగా మిలాన్-2024

- తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో ప్రారంభం
- నేడు ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్

తూర్పు నౌకాదళంలో మిలాన్-2024 ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు రెండో దశల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనుండగా 50 దేశాలకు చెందిన నేవీ అధికారులు, సిబ్బంది, వారి యుద్ధ నౌకలు, విమానాలు పాల్గొంటున్నాయి. తొలిరోజు సోమవారం మేరీటైమ్ వెల్ఫేర్ సెంటర్‌లో నేవీ అధికారులు అంతా కలిసి సముద్ర విన్యాసాలపై చర్చించారు. హాజరైన దేశాల ప్రతినిధులు ఒకరినొకరు పరిచయం చేసుకొని, ఆయా దేశాల ప్రాధాన్యతలు వివరించారు. హార్బర్ ఫేజ్‌లో భాగంగా రెండో రోజు మంగళవారం డాల్ఫిన్ కొండ నుంచి యారాడ కొండ వరకు ఆరోగ్య నడక నిర్వహిస్తారు. అలాగే హిందూస్థాన్ షిప్‌యార్డులో సబ్‌మెరైన్లను ఎలా రక్షించాలి అనేఅంశంపై ప్రదర్శన ఉంటుంది. సముద్ర విన్యాసాలపై మరోసారి చర్చిస్తారు. మిలాన్-2024 ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు సంబంధించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్ మంగళవారం ఆర్కే బీచ్‌రోడ్డులో జరగనుంది. దీని కోసం భారత నౌకాదళం, వివిధ దేశాల నుంచి వచ్చిన వారు గత మూడు రోజులుగా బీచ్‌లో రిహార్సళ్లు నిర్వహిస్తున్నారు. అవి సోమవారం కూడా జరిగాయి. ఇండియన్ కోస్టుగార్డు, రాష్ట్ర పోలీసులు, సీ కేడెట్లు, నేవల్ కేడెట్లతో పాటు అన్ని దేశాల నేవీల ప్రతినిధులు పాల్గొని మార్చ్ ఫాస్ట్ చేశారు.



వివిధ దేశాల పతాకాలతో పరేడ్

22న ఉప రాష్ట్రపతి రాక

21న రక్షణ మంత్రి...
మిలాన్-24కు హాజరు



ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్



కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):
మిలాన్-24లో పాల్గొనేందుకు భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ ఈనెల 22న, కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 21వ తేదీన నగరానికి రానున్నారు. ఉప రాష్ట్రపతి 22వ తేదీ ఉదయం 8.10 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో 10.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టులోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి 10.50 గంటలకు తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుని ఇంటర్నేషనల్ ...మిగతా 6వ పేజీలో

అధికారులు పక్కదారి

పరిపాలనా ఆమోదం లేకుండానే రోడ్డు నిర్మాణం

- సుమారు రూ.కోటి వ్యయంతో వెంకోజీపాలెం-హనుమంతవాక జంక్షన్ వరకూ తారురోడ్డు నిర్మాణం
- కనీసం టెండరు పిలవకుండానే పని పూర్తి చేయడంపై అనుమానాలు
- తాపీగా నేడు స్టాండింగ్ కమిటీ ఆమోదానికి...
- జాతీయ రహదారికి జీవీఎంసీ నిధులు వినియోగంపై ఆశ్చర్యం
- ఎన్ని విమర్శలు వస్తున్నా మారని జీవీఎంసీ అధికారుల తీరు



హనుమంతవాక జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన రహదారి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి, మరీ తమకు నచ్చినట్టు చేసుకుంటూ పోతున్నారు. జీ-20 సదస్సు పేరుతో కోట్లాది రూపాయలు విలువైన పనులు అడ్డగోలుగా చేయించిన అధికారులు, ఇటీవల దాదాపు రూ.1.4 కోట్ల విలువైన విశాఖ మ్యూజియం మరమ్మతుల పనులను కూడా నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. తాజాగా జాతీయ రహదారిపై వెంకోజీపాలెం జంక్షన్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ రూ.99.5 లక్షలు విలువైన తారు రోడ్డు నిర్మాణ పనులను కనీసం పరిపాలనా ఆమోదం తీసుకోకుండా పూర్తిచేసేశారు.

జీవీఎంసీ పరిధిలో ఏ పని చేపట్టేందుకైనా ఒక పద్ధతి ఉంటుంది. తొలుత సంబంధిత పనికి సంబంధించి అంచనాలు తయారుచేయాల్సి ఉంటుంది. ఆ అంచనాలను అధికారులు పరిశీలించిన తర్వాత కమిషనర్/జీవీఎంసీ కార్యవర్గం దృష్టికి తీసుకువెళ్లి ప్రతిపాదనలు చేయాలి. సంబంధిత పనిని ఆమోదించిన తర్వాత అధికారులు టెండరు ప్రక్రియ ప్రారంభిస్తారు. తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు అప్పగించి అగ్రిమెంట్ చేసుకుంటారు. ప్రస్తుతానికి వస్తే...జాతీయ రహదారిపై వెంకోజీపాలెం జంక్షన్ సమీపంలో ఉన్న నార్త్ స్టార్ హోమ్స్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ రోడ్డు బాగా పాడైపోయిందని, రూ.99.5 లక్షల వ్యయంతో కొత్తగా హాట్ మిక్స్ బీటీ లేయర్ వేసేందుకు ఆమోదం తెలపాలని కోరుతూ స్టాండింగ్ కమిటీ ఎజెండాలో చేర్చారు.

మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆ పనులను ఆమోదించాలా?, తిరస్కరించాలా?...అనే దానిపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే...ఆరోడ్డు నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తిచేసేశారు. అంటే...కనీసం పనులకు పరిపాలనా ఆమోదం తీసుకోకుండా, టెండర్ కూడా పిలవకుండానే ఆయా పనులను పూర్తిచేసేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకవేళ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపినప్పటికీ ఆయా పనులకు కచ్చితంగా టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలాంటపుడు పని పూర్తిచేసిన కాంట్రాక్టర్ కంటే ఇంకెవరైనా తక్కువకు బిడ్ వేస్తే అప్పుడు పరిస్థితి ఏమిటి?. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఇంత అడ్డగోలుగా, ఆగమేఘాల మీద రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం మరమ్మతులు కూడా పరిపాలనా ఆమోదం లేకుండానే నామినేషన్‌పై పనులు ... మిగతా 6వ పేజీలో

'జగన్ మళ్లీ గెలిస్తే భవిష్యత్తు శూన్యం'



గ్యాస్ అందిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఫిబ్రవరి 19 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే మన పిల్లల భవిష్యత్‌ను మనమే ఉరేసినట్లు అవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉజ్వల 2.0 పథకం ద్వారా లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్‌లను సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. దీనిలో భాగంగా నియోజకవర్గానికి సంబంధించిన 70 మంది లబ్ధిదారులకు గ్యాస్ స్టౌలను అందించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, రాంబాబు, రమణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్‌కు సత్కారం



సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 19 : తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్ ఐ.భాస్కరరావును, ప్రిన్సిపాల్ ఐ.సునీతను రోటరీ క్లబ్ పోర్టు సిటీ జిల్లా గవర్నర్ ఆర్వీ సుబ్బారావు, అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారావు, కార్యదర్శి ఎన్ఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రోగుల సహాయార్థం పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరావు సమక్షంలో విద్యార్థులు రూ.56 వేలను అందించారని చెప్పారు.

45 పడకలతో హ్యాపీహోమ్ డార్మెటరీ ప్రారంభం



ప్రారంభోత్సవంలో సీపీ, అధికారులు

మహారాణిపేట, ఫిబ్రవరి 19: నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన డార్మెటరీతోపాటు, ఆధునీకీకరించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ ఇతర పోలీస్ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. నగరంలో బందోబస్తు విధులతోపాటు ఇతర పనులపై వివిధ చోట్ల నుంచి వచ్చే సిబ్బందికి వసతి కల్పించేందుకు వీలుగా నిర్మించిన 'హ్యాపీ హోమ్' భవనాన్ని నిర్మించారు. ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం ఆవరణలో పునర్నిర్మించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని రిజర్వు ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు చేతులు మీదుగా ప్రారంభింపజేశారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ, అధికారులు పాల్గొన్నారు.

గుడికి వైసీపీ నేత తాళం!



తాళం వేయడంతో ఆలయవెలుపలున్న భక్తులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సత్యసాయి నగర్‌లోని విజయ దుర్గ ఆలయానికి వైసీపీ నేత ఒకరు సోమవారం తాళం వేసి వెళ్లిపోయారు. ఏటా ఇక్కడ ఫిబ్రవరి 20 నుంచి 22 వరకు అమ్మవారి ఉత్సవం జరుగుతుంది. ఆలయ ధర్మకర్త దీనిని నిర్వహిస్తారు. రెండేళ్ల నుంచి ఆయన పలు కారణాలతో నిర్వహించలేకపోవడంతో అదే వంశంలో మరొకరు ముందుకు వచ్చారు. అది ఇష్టం లేని స్థానిక వైసీపీ నాయకుడు రాజు ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. దాంతో సోమవారం జరగాల్సిన గణపతి హోమం ఆగిపోయింది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు.

జగన్‌ను గద్దె దించేందుకు జనం సిద్ధం

» శంఖారావం సభలో ఎమ్మెల్యే గంటా.శ్రీనివాసరావు » ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు అసెంబ్లీ సీట్లు వచ్చే పరిస్థితి లేదు

మురళీనగర్, ఫిబ్రవరి 19 ; ముఖ్యమంత్రి జగన్ పార్టీని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు గంటా.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బిర్లా జంక్షన్‌లోని హ్యుందాయ్ షోరూం గ్రౌండ్స్‌లో జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉమ్మడి మూడు జిల్లాల్లో కనీసం మూడు సీట్లు గెలుస్తామని చెప్పే ధైర్యం కూడా నేడు వైసీపీ నాయకులెవరూ చేయలేకపోతున్నారని ఆయన అన్నారు. జగన్ మహా భారతంలో అర్జునుడిలా తనకు తాను భావిస్తున్నా, వాస్తవానికి ఆయనది దుర్యోధనుడి పాత్ర అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కృష్ణార్జునుల్లె.. 2024 ఎన్నికల సంగ్రామాన్ని గెలిచి చూపిస్తారన్నారు. పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు



జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

ముతుకుపల్లి భరత్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ కార్యక్రమాలనుపటిష్ఠంగా అమలు చేస్తున్న వారిని లోకేశ్ ప్రత్యేకంగా సత్కరిస్తున్నారన్నారు. ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్... తనకుతాను పేదవాడినని, పెత్తందార్లతో యుద్ధం చేస్తున్నానంటూ పొంతన లేని మాటలు చెబుతున్నారని భరత్ విమర్శించారు. విశాఖలో సరైన అభివృద్ధి లేక నగర యువత మద్యానికి గంజాయికి బానిసలయ్యే దుస్థితిని వైసీపీ పాలకులుతీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం చేతకాని పాలనకు టీడీపీ,జనసేన ఐకమత్యంతో బుద్ధి చెప్పాలన్నారు. సభలో జనసేన నార్త్ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్ మాట్లాడుతు, నియోజకవర్గంలోపలు వార్డులతోపాటు కొండవాలు ప్రాంతాల ప్రజలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారన్నారు. ఎన్నికల్లో బూటకపు హామీలతో గద్దెనెక్కిన జగన్ జె-బ్రాండ్ మద్యం విక్రయాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. అలాగే, అశేష జనవాహిని మధ్య ఈ జరిగిన విశాఖ నార్త్ శంఖారావం పార్టీ శేణుల్లో జోష్ నింపింది. 50వవార్డు పార్టీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో జనాలు వచ్చారు.

శంఖారావం సభకు తరలిన పార్టీ శ్రేణులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 19: బిర్లా జంక్షన్‌లో సోమవారం జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 80అడుగుల రోడ్డు నుంచి కార్యకర్తలు ర్యాలీ గా వెళ్లారు. అలాగే, లోకేశ్‌ను వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. 44వ వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీ శంకర్‌నాయుడు, మోహనరావు, పందిరిపల్లి శ్రీను, రేపాటి శివ, రాజు, ఖుసిడ, షేక్ సోనా, గులాబ్ తదితరులు పాల్గొన్నారు. 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు ఆధ్వర్యంలో లోకేశ్ సభకు నాయకులు వెళ్లిలోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.నాయకులు రాజగిరి కన్నారావు, ఆరేపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు. తాటిచెట్లపాలెం నుంచి తెలుగు మహిళా రాష్ట్ర నేత ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నాయకులు జి.వీరుబాబు, ఎం. అప్పలనాయుడు, ఇ.ఈశ్వరరావు, బి.శ్రీకాంత్, ఎం.దేవి, డి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: 54వ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. పెంటకోట త్రినాద్,ఉప్పాడ శేఖర్,ఆదినారాయణ,రమణ ఉన్నారు.



సభా ప్రాంగణంలో టీడీపీ నేత కొయిలాడ వెంకటేశ్వరరావు, కార్యకర్తలు

14వ వార్డునుంచి..

సీతమ్మధార: గ్రేటర్ 14వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంప ధర్మారావు ఆధ్వర్యంలో లోకేశ్ శంఖారావం సభకు వార్డు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. ధర్మారావు లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉత్తరం ఇన్‌చార్జిగా నియమించాలని కృష్ణ వినతి

ఉత్తరనియోజకవర్గ టీడీపీసమన్వయకర్తగా తనను నియమించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కోరారు. ఈమేరకు బిర్లా జంక్షన్‌లో జరిగిన సభలో ఆయనను కలిసి వినతిపత్రమిచ్చారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 19:రాష్ట్రంలో అభివృద్ధి గాలికి వదిలేసి ఎదుటి వారిపై విమర్శలు చేయడం వైసీపీ నేతలు మానుకోవాలని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ హితవు పలికారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టులు వచ్చాయి, ఉపాధి, తదితర అంశాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. దేశంలో సుదీర్ఘ అనుభవం, విజన్ ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన చంద్రబాబుపై విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. పాలనలో జగన్, చంద్రబాబుకు ఎంతో తేడా ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో రూ.11 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపినట్టు ఆరోపించారు. పెట్టుబడుల సదస్సులో 99 ఒప్పందాలు చేసుకున్న వాటిలో ఎన్ని కంపెనీలు ప్రారంభించారని ప్రశ్నించారు. ఉద్యోగులకు బకాయిలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు, యువతకు ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఈసందర్భంగా హెచ్చరించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం పాల్గొన్న సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అత్యంత హేయమైనదన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను మోసగించిన సీఎం. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల కబ్జా చేయడమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న గండి బాబ్జీ

ఉక్కు భూముల అమ్మకానికి మళ్లీ వేలం

దరఖాస్తులకు మార్చి 5 వరకు గడువు .. 14, 15 తేదీల్లో వేలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విక్రయంపై ఎటువంటి అడుగులు ముందుకుపడడం లేదని చెబుతున్న కేంద్రం ఇక్కడి భూములను మాత్రం వేలం వేసి అమ్మడానికి మరోసారి ప్రకటన విడుదల చేసింది. నగరంలోని హెచ్‌బీ కాలనీ, పెదగంట్యాడ, ఆటోనగర్‌లలో సిబ్బంది క్వార్టర్లు ఉన్నాయి. అవి పాడుబడిపోవడంతో ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించారు. నేషనల్ మోనటైజేషన్ కార్పొరేషన్ నేతృత్వంలో నేషనల్ బిల్డింగ్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ భూములను విక్రయించే బాధ్యతను చేపట్టింది. గతంలో గుత్తగా అమ్ముతామని ప్రకటించగా ఇప్పుడు ప్లాట్లవారీగా ఇచ్చేస్తామని ప్రకటించారు. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అదే నెలలో 14, 15వ తేదీలలో ఈ-వేలం వేస్తారు.

-హెచ్‌బీ కాలనీలో 22.9 ఎకరాల్లో ఉన్న 588 ప్లాట్లు (45 ల్యాండ్ పార్శిళ్లు).

- పెదగంట్యాడలో 2 ఎకరాలలోని 76 ఇళ్ల స్థలాలు (4 ల్యాండ్ పార్శిళ్లు).

- ఆటోనగర్‌లో 8 ఇళ్లు (ఒక ల్యాండ్ పార్శిల్) అమ్మకానికి పెట్టారు. వీటి ద్వారా వేయి కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సమస్యలపై వాసుపల్లి వినతి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 19: దక్షిణ నియోజకవర్గంలో సమస్యలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ సోమవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కలిసి వినతి పత్రమిచ్చారు. ప్రసాద్ గార్డెన్స్‌లో 388 జీవో ప్రకారం ఇళ్లపట్టాల సమస్య, అంగడి దిబ్బ ఇళ్ల స్థలాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

తరువాత పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం వెళ్లిపోయారు.

పేర్లు ఖరారయ్యారంటూ ఊహాగానాలు

పార్టీ అధినేతతో పలువురు సమావేశమైన సందర్భంగా కొందరికి స్పష్టమైన భరోసా లభించిందని, వారికి పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారంటూ సోషల్ మీడియాలో కొందరి పేర్లు షికారు చేశాయి. విశాఖ జిల్లాలో ఇద్దరికి, అనకాపల్లి జిల్లాలో ఇద్దరికి ఫలానా స్థానాలు అంటూ ప్రచారం చేశారు. అయితే ఎవరి పేర్లు ఖరారు చేయలేదని, ఆ ఊహాగానాలు నమ్మవద్దని పార్టీ నాయకులు పలువురు స్పష్టంచేశారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

సీతమ్మధార, ఫిబ్రవరి 19 : ఉన్నత్ర ప్రమాణాలతో కూడిన విద్యనభ్యసించి అనుకున్న లక్ష్యాలను అధిరోహించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విద్యార్థులకు సూచించారు.ఎస్ఎఫ్ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు అయనఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగించారు. ఉన్నత విద్యనభ్యసించడం వల్ల భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. అనంతరం విద్యార్థినుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీ జోసెఫ్, ప్రిన్సిపాల్ పి.మనోజ్, పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాసేలా సిద్ధంచేయండి

జ్ఞానాపురం, ఫిబ్రవరి 19 : వార్షిక పరీక్షల్లో ప్రశాంతంగా రాసేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ కోరా రు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో సోమవారం జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోజిల్లాలో అన్ని పాఠశాలల యాజమాన్యాల సారథ్యంలో పరీక్షలు రాయనున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్లతో పరీక్ష పే చర్చ 2024 పేరిట నిర్వహించిన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. కమిషన్ కో ఆర్డినేటర్ కె.చిట్టిబాబు, డీఈవో ఎల్. చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు, ఏపీసీ శ్రీనివాస్, డీసీపీయూపీ ఓఐసీ రమేష్, డైట్ భీమిలి లెక్చరర్ త్రినాథరావు, సారిపల్లి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీషా బేగంఉన్నారు.

కేజీహెచ్‌లో మరో పిల్లల ఐసీయూ వార్డు : కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 19: కేజీహెచ్‌లో ఆధునిక వసతులతో మరో పిల్లల ఐసీయూ వార్డును అందుబాటులోకి తీసుకురానున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా కేజీహెచ్‌లో పర్యటించి పిల్లల వార్డును తనిఖీ చేశారు.అక్కడ అందుతున్న సేవలపై చిన్నారులు, మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. పిడియాట్రిక్ సాధారణ వార్డును ఐసీయూ వార్డుగా మార్పులో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, వైద్యాధికారులున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో 'స్పందన'కు 140 అర్జీలు

మహారాణిపేట, ఫిబ్రవరి 19:జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అన్ని శాఖల విభాగ అధిపతులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు 140అర్జీలు స్వీకరించి ఆయన మాట్లాడారు.డీఆర్‌వో కే మోహన్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

భీమిలీ తీరాన విజయసాయి రెడ్డి కుటుంబం కబ్జా: జనసేన

విజయసాయి రెడ్డి కుటుంబ సభ్యులు భీమిలీ టౌన్ పరిధి సముద్ర తీర ప్రాంతంలో అవియాన్ రియాల్టీ పేరిట హస్తగతం చేసుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఈమేరకు ఆయనస్పందనలో ఫిర్యాదు చేశారు.

పోలీసు కమిషనరేట్‌కు 42 ఫిర్యాదులు

పోలీసు కమిషనరేట్‌లో జరిగిన స్పందనలో 42 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఏడీసీపీ ఎంఆర్‌కే రాజు తెలిపారు.

గాజువాక, పెందుర్తిలకు వైసీపీ పరిశీలకుల నియామకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం గాజువాక, పెందుర్తి నియోజకవర్గాలకు కొత్తగా పరిశీలకులను నియమించింది. గాజువాక నియోజకవర్గం పరిశీలకుడిగా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పెందుర్తి పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డిని నియమించారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకులతో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి రెండు రోజులు కిందట ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరినీ పరిశీలకులుగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అలాగే అనకాపల్లి నియోజకవర్గం పరిశీలకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్‌ను పశ్చిమ నియోజకవర్గానికి మార్చారు. భీమిలి నియోజకవర్గానికి మాజీ మంత్రి పి. బాలరాజు, తూర్పు నియోజకవర్గానికి మొల్లి అప్పారావు, దక్షిణ నియోజకవర్గానికి వీసం రామకృష్ణ, ఉత్తర నియోజకవర్గానికి చిక్కాల రామారావు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎన్నికలకు ముందు ఫొటోగ్రాఫర్‌పై దాడి ట్రయలా?

- హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసి వైసీపీ రౌడీమూకలు కిరాతంగా కొట్టి హింసించడం రానున్న ఎన్నికలకు ట్రయల్ అనుకోవాలా అని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజల ముందుకు తెస్తున్న మీడియాపై దాడి జరగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

దాడికి ఖండన

డాబాగార్డెన్స్: అనంతపురం జిల్లా రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ బి.శ్రీకృష్ణపై దుండగులు మూకుమ్మడిగా దాడి చేయడాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ విశాఖ జిల్లా యూనిట్లు తీవ్రంగా ఖండించాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు , ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పైడి దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని ఖండించిన వారిలో ఏపీబీజేఏ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి ఎస్.అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, కోశాధికారి బి. సీతారామమూర్తి ఉన్నారు.

కేజీహెచ్‌లో అడ్డగోలుగా ఉద్యోగాలు

- పారా మెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ లేకపోయినా కొందరికి ఉద్యోగాలు కల్పన
- కొవిడ్ సమయంలో పని చేసినట్టుగా తప్పుడు పత్రాల సమర్పణ
- ఈ జాబితాలో ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, రేడియో గ్రాఫర్లు
- ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మరింత వెలుగులోకి వచ్చే అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో పలువురు అడ్డగోలుగా ఉద్యోగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పత్రాలు సమర్పించి మరీ పలువురు ఉద్యోగాలు సాగిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వీరిలో స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు ఉన్నట్టు చెబుతున్నారు. సదరు సిబ్బంది వ్యవహారాన్ని పలువురు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. 2022-23 మధ్య కాలంలో కేజీహెచ్‌లో పలు పోస్టులను భర్తీ చేశారు. ఈ పోస్టులు భర్తీలో పాటించాల్సిన నిబంధనలకు విరుద్ధంగా పలువురికి ఉద్యోగాలను కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేరాలంటూ తప్పనిసరిగా బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఒకేషనల్ ఎంఎల్‌టీ కోర్సుల్లో ఏదో ఒకటి పూర్తి చేయడంతోపాటు పారా మెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) పూర్తి చేసిన వారికి క్లినికల్ శిక్షణ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకేషినల్ ఎంఎల్‌టీ పూర్తి చేసిన వాళ్లు కనీసం ఏడాదిపాటు వంద పడకల ఆస్పత్రిలో పని చేస్తేనేగానీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఐదేళ్లకోసారి రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, కేజీహెచ్‌లోని ల్యాబ్ టెక్నీషియన్లుగా ఉద్యోగాలు పొందిన పలువురుఆస్పత్రుల్లో శిక్షణ లేకుండానే రిజిస్ట్రేషన్లను అడ్డగోలు చేయించుకున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు వెళ్లిన దరఖాస్తులను శిక్షణ పొందిన ఆస్పత్రులకు పారామెడికల్ బోర్డు పంపిస్తోంది. ఆయా ఆస్పత్రులు నుంచి సరైన స్పందన లేకపోవడంతో రెన్యువల్ చేయడం లేదు. రెన్యువల్ కాకపోయినప్పటికీ వారంతా ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. మొదట్లో పారామెడికల్ బోర్డులో ఎలా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారో గానీ, ఇప్పుడు రెన్యువల్ చేయించుకోలేక ముప్పుతిప్పలు పడుతున్నారు. మరోవైపు రెన్యువల్ పత్రాలు ఇవ్వాలంటూ ఆస్పత్రి అధికారులు అడుగుతుండడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నట్టు తెలిసింది. మరోవైపు ఒకేషనల్ ఎంఎల్‌టీ పూర్తి చేసి డీఎంఎల్‌టీ, బీఎస్ ఎంఎల్‌టీ పూర్తి చేసిన అభ్యర్థులు కొందరు ఉన్నారు. కేజీహెచ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసినప్పుడు ఎంఎల్‌టీ ఒకేషనల్ చేసి.. అప్రెంటీస్ చేయకుండానే మరికొందరు ఉద్యోగాలు పొందారు. దరఖాస్తు సమయంలో ఒకేషినల్ సర్టిఫికెట్లు చూపించి(మార్కులు అధికంగా ఇస్తారని), సర్టిఫికెట్లు పరిశీలన సమయంలో మాత్రం బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ చూపించి ఉద్యోగాలు పొందినట్టు చెబుతున్నారు. కొవిడ్ సమయంలో పనిచేసినట్టుగా పత్రాలను చూపి మరికొందరు ఉద్యోగాలు పొందారు. వీరిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నట్టు చెబుతున్నారు. రేడియో గ్రాఫర్ పని చేస్తున్న వారిలో కూడా ఇటువంటి వ్యక్తులు ఉన్నట్టు చెబుతున్నారు. ఉద్యోగంలో చేరే సమయానికి సర్టిఫికెట్లు ఉండాలి. కానీ, లేకపోయినప్పటికీ ఉద్యోగాలుకల్పించినట్టు చెబుతున్నారు. వీరిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పక్కదారి

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసిన విషయం రెండు రోజుల కిందట బయటపడిన విషయం తెలిసిందే.

జాతీయ రహదారికి జీవీఎంసీ నిధులు వెచ్చించడంపై అనుమానాలు

తగరపువలస నుంచి లంకెలపాలెం వరకూ సుమారు 70 కిలోమీటర్లు విస్తరించి ఉన్న జాతీయ రహదారి ప్రస్తుతం భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆధీనంలో ఉంది. నగరం మధ్య నుంచి ఉండడంతో సుందరీకరణ కోసం సెంటర్ మీడియన్‌లో మొక్కలు పెంపకం బాధ్యతను మాత్రమే జీవీఎంసీ తీసుకుంది. రోడ్డు నిర్వహణ బాధ్యతలు మాత్రం ఎన్‌హెచ్ఏఐ చూసుకుంటోంది. రోడ్డుపై గుంతలుపడినా, మరమ్మతులు చేయాల్సి వచ్చినా ఎన్‌హెచ్ఏఐ మాత్రమే చేస్తోంది. అందువల్లనే అగనంపూడి వద్ద టోల్‌గేట్ పెట్టి మరీ వాహనాల నుంచి టోల్‌గేట్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో నార్త్ స్టార్ హోమ్స్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ దాదాపు రూ.కోటి వెచ్చించి జీవీఎంసీ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందనేది అర్థం కావడం లేదు.

పోనీ రోడ్డు నిర్మాణ పనులైనా సరిగా చేశారా?...అంటే అదీ లేదు. సాధారణంగా జాతీయ రహదారిపై కొత్తగా బీటీ లేయర్ వేయాల్సి వస్తే ప్రస్తుతం ఉన్న లేయర్‌ను యంత్రాలతో పూర్తిగా తొలగించి, డెబ్రిస్‌ను యార్డుకు తరలిస్తారు. తర్వాత రోడ్డును శుభ్రం చేసి, ఆ తర్వాత హాట్‌మిక్స్‌తో బీటీ లేయర్ వేస్తారు. తర్వాత శక్తివంతమైన హైడ్రాలిక్ రోలింగ్ యంత్రాలతోరోలింగ్ చేస్తారు. దీనివల్ల రోడ్డు మన్నిక ఉంటుంది. కానీ హనుమంతవాక జంక్షన్ వద్ద రోడ్డు నిర్మాణంలో ఏమాత్రం నాణ్యత కనిపించడం లేదు. కనీసం జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టిలో పెట్టి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేశారా?, లేదా? అనే చర్చ జరుగుతోంది. అధికారులు తమ కమీషన్ల కోసం ఇలాంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున కమిషనర్ దీనిపై దృష్టిసారించిబాధ్యులైనవారిపై చర్యలుతీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

విశాఖను గుండెల్లో పెట్టుకుంటాం

... 5వ పేజీ తరువాయి

పరిధిలోని లంకా మైదానంలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. రెండు నెలల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాబోతోందని, విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి దాటేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫుట్‌బ్రిడ్జిలు నిర్మిస్తామని, కరాస వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధే తప్ప కొత్తగా చేసిందేమీ లేదని లోకేశ్ అన్నారు. వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు నియోజకవర్గంలో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు నగరంలో పలుచోట్ల భూములు ఆక్రమించుకున్నారన్నారు. ఎంతో ప్రశాంతమైన విశాఖలో అశాంతి కలిగేలా వైసీపీ నేతలు వ్యవహరించారని లోకేశ్ ఆరోపించారు. మర్డర్లు, కిడ్నాప్‌లు, భూకబ్జాలు, గంజాయి అమ్మకాలకు నగరం కేంద్రంగా మారిందన్నారు.

గాజువాక ప్రాంతం మినీ ఇండియా అని లోకేశ్ అభివర్ణించారు. విశాఖ ఉక్కు కర్మాగారం, భెల్, హెచ్‌పీసీఎల్, గంగవరం పోర్టు వంటివి ఇక్కడ ఉన్నాయని పేర్కొంటూ దేశం నలుమూలల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తేఅగనంపూడి టోల్‌గేటు ఎత్తివేతకు ప్రయత్నిస్తామన్నారు. గంగవరం పోర్టు బాధితులను ఆదుకుంటామని, ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని, గంగవరం పోర్టు కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గాజువాక పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా ఫ్రైట్ కారిడార్‌తోపాటు ఫ్లైవోవర్లు ఏర్పాటుకు కృషిచేస్తామని, గంగవరం మత్స్యకారుల కోసం జెట్టీకి బ్రేక్ వాటర్ ఏర్పాటుచేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గాజువాక నియోజకవర్గాన్ని పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించి, 19వేల మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలోఅన్ని కులాలు, మతాలకు సంక్షేమ పథకాలు అందించామని, సామాజిక భవనాలు నిర్మించామని చెప్పారు.

ఉక్కు భూములు ఎవరు కొన్నా వెనక్కి తీసుకుంటాం.....

విశాఖ ఉక్కు కర్మాగారం భూములు అమ్మకానికి ఏపీలో కాకుండా హైదరాబాద్‌లో పేపర్‌లో ప్రకటన జారీచేసినట్టు ఇప్పుడే సెల్‌ఫోన్‌లో చూశానని లోకేశ్ అన్నారు. ఉక్కు కర్మాగారం భూములు ఎవరు కొనుగోలు చేసినా అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటామని, ఈ విషయం కొనుగోలు చేసే వ్యక్తులు గుర్తుంచుకోవాలన్నారు.ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సమస్యపై ఎప్పుడైనా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారా?...అని ప్రశ్నించారు. చివరకు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోరాడితే ఆయన్ను వేధించి షాపింగ్ కాంప్లెక్స్ కూలగొట్టారని ఆరోపించారు. పది రోజుల నుంచి ఉత్తరాంధ్రలో చేపట్టిన యాత్రకు భారీగా స్పందన వచ్చిందని లోకేశ్ అన్నారు. ఇక్కడ ప్రజల జీవితాలతో వైసీపీ నాలుగేళ్ల పది నెలలుగా ఆడుకుందని ఆరోపించారు. జగన్‌ను ప్రజలు ఫుట్‌బాల్ ఆడుకునే సమయం రెండు నెలల్లో రాబోతోందన్నారు. సభలలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, చిక్కాల విజయ్, ముత్యాలనాయుడు, లొడగల కృష్ణ, ముక్కా శ్రావణి, పోలమరశెట్టి శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, మొల్లి ముత్యాలు, పులి లక్ష్మీబాయి, రౌతు శ్రీనివాసరావు, నల్లూరి సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, జనసేన నాయకులు కోన తాతారావు, ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

22న ఉప రాష్ట్రపతిరాక

... 5వ పేజీ తరువాయి

మేరీటైమ్-2024 సెమినార్‌ను ప్రారంభిస్తారు. సెమినార్ అనంతరం 12.55 గంటలకు ఐఎన్ఎస్ డేగా నుంచి బయలుదేరి ఢిల్లీ వెళతారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీలో బయలుదేరి 3.15 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ చోళాకు వెళతారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు గంటలకు సముద్రిక ఆడిటోరియంకు చేరుకుని మిలాన్ వేడుకలు ప్రారంభిస్తారు. తిరిగి ఐఎన్ఎస్ చోళాకు చేరుకుని రాత్రి 7.15కు నేవీ అధికారులు ఇచ్చే విందుకు హాజరవుతారు. 22వ తేదీ ఉదయం 9.30కు బయలుదేరి జగదల్‌పూర్ వెళతారు.


ఉక్కు సీజీఎం గాంధీతో మాట్లాడుతున్న నాయకులు

కార్మిక సమస్యలను పరిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19: స్టీల్‌ప్లాంట్ కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీని ఇంటక్ నాయకులు కోరారు. సోమవారం సీజీఎంను నాయకులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. వేతన సవరణ చేయాలని, ఉద్యోగులను తొలగించరాదని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, ప్లాంట్‌లో సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉక్కు కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లను యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, మింది దేముడు, ఎస్‌పి నాయుడు, నగేశ్, రాథోడ్, సుదర్శన్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి, తదితరులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 19: దేశాన్ని 2047 నాటికి వికసిత భారత్‌గా తీర్చిదిద్ది ప్రపంచంలోనే ప్రథమ స్థానానికి చేర్చడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో సోమవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.రోహిణి, కూనూరు అప్పలరాజు, బి.శ్రీనివాస్, నున్నా శ్రీరామమూర్తి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక జోనల్ కమిషనర్‌గా సన్యాసినాయుడు బాధ్యతలు స్వీకరణ

గాజువాక, ఫిబ్రవరి 19: గాజువాక జోనల్ కమిషనర్‌గా బి.సన్యాసినాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్ బదిలీపై జోన్-4 కు వెళ్లటంతో జోన్-4నుంచి సన్యాసినాయుడు బదిలీపై గాజువాక వచ్చారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది జోనల్ కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరించిన బి.సన్యాసినాయుడు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

మల్కాపురం, ఫిబ్రవరి 19 : అనంతపురం రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణుల దాడిని పారిశ్రామిక ప్రాంత టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వైసీపీ అరాచక పాలనకు ఈ ఘటన ఓ నిదర్శనమన్నారు. విధుల్లో భాగంగా ఫొటోలు తీస్తున్న శ్రీకృష్ణపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇది సీఎం సాక్షిగానే జరిగిందని ఆరోపించారు. ఈఘటనలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, టీడీపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు నాయుడు, వార్డుల అధ్యక్షులు మజ్జి సోమేశ్, కోరాడ శ్రీనివాసరావు, మాతా శ్రీను, నాయకులు మితిరెడ్డి శంకర్, పూడి భాస్కర్‌రావు, రామ్మోహన్‌నాయుడు, కార్మిక నాయకుడు అప్పలరాజు ఈ ఘటనను ఖండించారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడీ, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 24, దొండకాయలు 40, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబాటి 28, ముల్లంగి 16, నిమ్మ కాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 42, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	118
ఫారం ధర	--	138
విత్ స్కిన్	--	246
స్కిన్‌లెస్	--	256

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

రాష్ట్రం బాగు కోసం టీడీపీ-జనసేన గెలవాలి

లోకేశ్ శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఎన్నికల యుద్ధానికి సైనికుల్లా సిద్ధం కావాలి: విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్

బినామీ కంపెనీలతో గంగవరం పోర్టును కాజేసిన సీఎం జగన్: జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు


..మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు

గాజువాక, ఫిబ్రవరి 19: రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం చాలా అవసరమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక లంకా మైదానంలో సోమవారం జరిగిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఎన్నికలన్నీ ఒక ఎత్తయితే ఇప్పుడు జరగనున్నది మరో ఎత్తు అని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అక్రమ కేసులతో చంద్రబాబును అరెస్టు చేయించిందని, దీంతో ఆ పార్టీ నేతలు రాక్షస ఆనందం పొందారన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముందుకువచ్చారన్నారు. యువగళానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని, దీంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి సమాధి కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందని మండిపడ్డారు.

టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ ఎన్నికల యుద్ధానికి సైనికుల్లా సిద్ధం కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైసీపీ ఎంపీలు కానీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కానీ కేంద్ర ప్రభుత్వంపై ఎటువంటి ఒత్తిడి తీసుకురాలేకపోవడం దారుణమన్నారు. ప్రత్యేక హోదా వంటి విషయాలపై గత ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీని ఏం చేశారని ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించడంతో పాటు గంగవరం పోర్టు నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు పలు ప్రధాన సమస్యలను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపడతామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టును సీఎం జగన్ బినామి కంపెనీలతో కాజేశారని, ఈ క్రమంలో రూ.1,200 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గాజువాకలోని ఒక ప్రధాన సమస్యనూ వైసీపీ తీర్చలేదని, సమస్యలను జటిలం చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గందం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, బొండా జగన్, పులి లక్ష్మీబాయి, మొల్లి ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, కోగంటి లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


ప్రసన్నగిరి ప్రదక్షిణలో భాగంగా పల్లకీలో భూదేవి, శ్రీదేవి సమేతంగా శ్రీవారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు... పక్కన మహిళల కోలాటం

గోవింద నామస్మరణతో మార్మోగిన ప్రసన్నగిరి

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షణలో పాల్గొన్న ప్రజలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 19: భక్తుల గోవింద నామస్మరణతో సోమవారం ప్రసన్నగిరి పరిసర ప్రాంతాలు మార్మోగాయి. బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన గిరి ప్రదక్షణలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు గోవిందా గోవింద.. నమో వేంకటేశాయ అని స్మరిస్తూ ముందుకు సాగారు. ముందుగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి అర్చకులు లక్షణాచార్యులు, నారాయణాచార్యులు ప్రత్యేక పూజలు జరిపాక గిరి ప్రదక్షణకు శ్రీకారం చుట్టారు. మేళతాళాలతో పాటు బీహెచ్‌పీవీ సత్యసాయి భజన మండలి సభ్యులు ఆలపించిన అన్నమయ్య కీర్తనలకు అనుగుణంగా నాతయ్యపాలెం, గవర జగ్గయ్యపాలెం కాలనీలకు చెందిన బృందాలు కోలాటాలతో ముందు సాగగా, ఆ వెనక 108 కలశాలతో భక్తులు పల్లకి ముందు గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షణ చేపట్టారు. దేవస్థానం ప్రవేశ ద్వారం నుంచి మింది రహదారి, అప్పన్నకాలనీల మీదుగా ప్రసన్నగిరి చుట్టు మూడుసార్లు గిరి ప్రదక్షణ చేశారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని దేవస్థానం పాలక మండలి సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు, మాజీ చైర్మన్ ఆట్లూరి రమేశ్, బి.అచ్చయ్యనాయుడు, ఎన్.శ్రీనివాసరావు, కె.శాంతకుమారి, పి.అప్పారావు, పేకేటి వెంకటరమణ, డి.సూర్యనారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రాజశ్యామల అనుగ్రహంతో శారదాపీఠం ఆవిర్భావం

▸ వార్షికోత్సవ ముగింపులో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి


ప్రవచనకర్త విభీషణశర్మకు విశారద బిరుదు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

పెందుర్తి, ఫిబ్రవరి 19: రాజశ్యామల అమ్మవారి కటాక్షంతో శారదాపీఠం ఆవిర్భవించిందని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. చినముషిడివాడలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పీఠం వార్షికోత్సవాలు సోమవారం జరిగిన పూర్ణాహుతితో ముగిశాయి. ఈసందర్భంగా అధిష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం రాజశ్యామల యాగానికి రుత్వికులు పూర్ణాహుతి చేశారు. ఈసందర్భంగా పీఠాధిపతి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. పీఠానికి జ్ఞాన పరంపర ఉందని, అందువల్లే వారసత్వపు హక్కులేకున్నా భారతావనిలోనే ఈపీఠం ఖ్యాతికెక్కిందన్నారు. రాజశ్యామల అమ్మవారిని ఉపాసన దేవతగా ఆరాధిస్తున్న ఏకైక పీఠం తమదని అన్నారు. తాను కషాయం కట్టిన సన్యాసిని కాదని ధర్మపోరాటాలు సాగించిన భీతిలేనికీర్తితో గణతికెక్కానన్నారు. కొంత మంది దుర్మార్గపు ఆలోచన, మనస్సుతో పీఠాన్ని చిదిమేయాలని చూశారని అమ్మ కృపతో అలాంటి వారి ఆటలు చెల్లలేదన్నారు. అమ్మవారి మహిమతో ఎంతో మంది ముఖ్యమంత్రులయ్యారన్నారు.అనంతరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత గొల్లపల్లి శ్రీరామకృష్ణ రచించిన రాజశ్యామల పద్యాలను పీఠాధిపతులు ఆవిష్కరించారు. పండిత ప్రవచనకర్త విభీషణశర్మకు విశారద బిరుదును ప్రదానం చేసిన స్వర్ణ కంకణ ధారణ చేశారు. ఈవేడుకల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న అరాచకాలు

▸ ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు విమల


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

మల్కాపురం, ఫిబ్రవరి 19 : దేశ వ్యాప్తంగా మహిళలపై అరాచాకాలు రోజురోజుకు పెరిగిపోతున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం స్పందించడం లేదనిఐద్వా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్.విమల అన్నారు. శ్రీహరిపురం గుల్లలపాలెంలో ఐ ద్వా జాతీయ మహిళ సమావేశాల పోస్టర్‌ను సోమవారం అవిష్కరించారు. ఈనెల 22వ తేదీన నగరంలోని సరస్వతీ పార్కు నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 22 నుంచి 25వ తేదీ వరకు నగరంలోని అల్లూరి సీతారామారాజు విజ్ఞాన కేంద్రంలో ఐద్వా సభలు జరగనున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో మ ల్కాపురం జోన్ ఐద్వా అధ్యక్షు రాలు బి.మమత. కె.ఈశ్వరమ్మ, పి.పుణ్యవతి, కృష్ణవేణి, హేమ పాల్గొన్నారు.

పూల మొక్కల కనువిందు


హెచ్‌పీసీఎల్‌కు వెళ్లే మార్గం మధ్యలో మొక్కల కుండీలు

మల్కాపురం, ఫిబ్రవరి 19: పారిశ్రామిక ప్రాంత ప్రధాన రహదారి మార్గం మధ్య లో ఏర్పాటుచేసిన పూలమొక్కలు కనువిందు చేస్తున్నాయి. మిలాన్ నేపథ్యం, అలాగే హెచ్‌పీసీఎల్‌కు ప్రధాని మంత్రి మోదీ, కేంద్ర మంత్రి వస్తుండడంతో రహదారులను అభివృద్ధి చేశారు. అలాగే, మార్గం మధ్యలో పూలమొక్కతో కూడిన కుండీలను ఏర్పాటుచేశారు. సింధియా జంక్షన్ నుంచి మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వరకు హెచ్‌పీసీఎల్ యజమాన్యం ఏర్పాటుచేసిన పూల మొక్కలు వాహనదారులు, ప్రయాణికులకు ముచ్చట గొలుపుతున్నాయి. విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటుచేస్తే ఈ రహదారి మరింత అందంగా తీర్చిదిద్దినట్లవుతుందని ఈసందర్భంగా పలువురు అభిప్రా యపడుతున్నారు.

జనసేన అధినేతకు ఘనంగా వీడ్కోలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 19: నగర పర్యటనకు ఆదివారం వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ తిరిగి ప్రయాణమయ్యారు. నగరంలోని ఓహోటల్ నుంచి సోమవారం సాయంత్రం 6కు విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కల్యాణ్‌కు పార్టీ శ్రేణులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో రాజమండ్రి వెళ్లారు.

కలెక్టర్, కమిషనర్ శారదా పీఠం సందర్శన

పెందుర్తి, ఫిబ్రవరి 19: చినముషిడివాడలోనిశారదాపీఠాన్ని సోమవారం సాయంత్రం కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్రకు కలిసి ఆయన నుంచి ఆశీస్సులు తీసుకున్నారు.


ఉత్తరపీఠాధిపతి స్వాత్మానందేంద్రతో మాట్లాడుతున్న కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లు

ఆక్రమణలపై జెడ్సీకి ఫిర్యాదు..


జెడ్సీ హైమావతికి ఫిర్యాదు చేస్తున్న శంకరరావు

వేపగుంట, ఫిబ్రవరి 19: జీవీ ఎంసీ 97వ వార్డు పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై జోన్ 8 జెడ్సీ కె.హైమావతికి కార్పొరేటర్ భర్త సేనాపతి వసంత శంక రరావు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చినముషిడివాడ శారదా పీఠం ఆర్చ్ పక్కన అనుమతి లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నట్లు, అలాగే, శారదా పీఠం వెనుక ఉన్న పార్కు స్థలంలో జీవీఎంసీ వేసిన స్తంభాలు పీకేసి నిర్మాణాలు చేపడుతున్నట్టు వివరించారు. విమానగర్‌లో రహదారి ఆక్రమించి నిర్మించడంతోపాటు అక్కడి మామిడి చెట్టును తొలగించారన్నారు. ఈ ఫిర్యాదులను సంబంధిత శాఖాధిపతులకు పంపించి చర్యలు చేపట్టనున్నట్టు జెడ్సీ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు అరెస్టు

గోపాలపట్నం, ఫిబ్రవరి 19: గంజాయిని తరలిస్తున్న బెంగళూరుకు చెందిన ఇద్దరు యువకులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెంగళూరుకు చెందిన షాహిద్ అఫ్రిద్, వసీమ్ పాషా ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గోపాలపట్నం శ్మశాన వాటిక కూడలిలో మాటువేసిన పోలీసులు ఈ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద బ్యాగులో 5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. ఈ మేర సీఐ కె.సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

'ముదపాక భూముల రిజిస్ట్రేషన్లపై బెదిరింపులు'

పెందుర్తి, ఫిబ్రవరి 19: మండలంలోని ముదపాకలో ల్యాండ్‌పూలింగ్‌లో భూమిలిచ్చిన రైతులకు పరిహారం కింద ఇవ్వాల్సిన 900 గజాల స్థలాన్ని ఓ స్థిరాస్తి వ్యాపారికి రిజిస్టేషన్ చేస్తేనే ఎల్‌పీవోసీలు ఇస్తామని కొందరు ఉన్నతాధికారులు తమని భయపెట్టడంతో కోర్టును ఆశ్రయించినట్టు దళిత రైతులు సోమవారం జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ డీఐజీ బాలకృష్ణకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.న్యాయస్థానం ఉత్తర్వులు ధిక్కరించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు దళిత రైతులు ఎన్ రమణ, రామకృష్ణ, అప్పారావు ఆరోపించారు. న్యాయం చేయాలని కోరారు.

నేడు భీష్మ ఏకాదశి పూజలు

ఎన్.ఎ.డి. జంక్షన్/ వేపగుంట ఫిబ్రవరి 19: భీష్మ ఏకాదశి పూజలు మంగళవారం నిర్వహించనున్నారు. కాకానీనగర్, విమాన్‌నగర్ వెంకటేశ్వరాలయాలను ఈమేరకు సిద్ధం చేశారు. రవినగర్ శేషాద్రి కొండపైన వెంకటేశ్వరాలయం, వేపగుంట బీసీ కాలనీలో వెంకటేశ్వరాలయంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు.


పసిడి పతకం సాధించిన ఉక్కు ఉద్యోగి అప్పారావును అభినందిస్తున్న నాయకులు

జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేతకు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉక్కు ఉద్యోగి అండిబోయిన అప్పారావును పలువురు కార్మిక సంఘ నాయకులు సోమవారం ప్లాంట్‌లో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాస్టర్ టూ కేటగిరిలో 93 కిలోల విభాగంలో అప్పారావు పసిడి పతకం సాధించారు. జాతీయ పోటీల్లో అప్పారావు మంచి ప్రతిభ కనబరచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, దాలినాయుడు, పిట్టా రెడ్డి, ఎన్నేటి రమణ, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 19: గంగవరం మీసేవ మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మాధవస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.పది వేలు, రూ.ఐదు వేల చొప్పున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సీహెచ్ రాజు, ధనరాజు, పోలరాజు, మసేను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలి


విద్యార్థులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులను తిలకిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 19: అందరి విద్యార్థులలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, వారిని తగిన విధంగా ప్రోత్సహిస్తే ప్రతిభావంతులవుతారని టీఎస్సార్ టీటీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లోని యాపిల్ ఐ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో చిన్నారులు యాంత్రికంగా తయారవుతున్నారని, చదువు, మార్కులే కాకుండా తమ పిల్లలను వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలలోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు గ్రంథాలయాల్లోని మహాత్ముల చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఎస్.విష్ణువర్ధన్,ప్రమీలాముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 15: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడలో దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి సారెను భక్తులంతా పురవీధుల్లో ఊరేగించి ఆలయానికి తీసుకువచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన పరసలో ఏర్పాటు చేసిన కోలాటాలు, చెక్కభజనలు, గారడీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పెతకంశెట్టి అప్పలనరసింహం పేరిట సేవలు భేష్

▸ జయంతి ఉత్సవంలో టీడీపీ నేత శ్రీభరత్


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న టీడీపీ నేత శ్రీభరత్

గోపాలపట్నం, ఫిబ్రవరి 19: మాజీ పార్లమెంట్ సభ్యుడు, దివంగత నేత పెతకంశెట్టి అప్పలనరసింహం జయంతి వేడుకలు గోపాలపట్నంలోని పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు నివాసంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెతకంశెట్టి అప్పలనరసింహం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని టీడీపీ నేత శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పల నరసింహం పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతున్న గణబాబుకు అభినందనలు తెలిపారు. గణబాబు మాట్లాడుతూ తన తండ్రి అప్పలనరసింహం పేరిట ఏటా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో అభిమానులు, టీడీపీ కార్యకర్తలుపాల్గొని రక్తదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అప్పలనరసింహం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విద్యతోనే వికాసం


కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిలా

మల్కాపురం, ఫిబ్రవరి 19 : విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యమని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థినుల ప్రత్యేక వీడ్కోలు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సిస్టర్ జానిస్, సుపీరియర్ సిస్టర్స్ జయశీల, ఎల్సీ తదితరులు ఇంటర్మీడియట్ తరువాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల వివరాలను తెలియజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా, క్రీడలు, విద్యలో ప్రతిభచూపిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు నదియా, సంధ్య, అనసూయ, ప్రేమలత, అబీదా, ఆదిలక్ష్మి, సుధ, జగన్, పరమేశ్, సలోమి, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యానగర్‌లో చోరీ

పెందుర్తి, ఫిబ్రవరి 19: పెందుర్తి సమీపాన సూర్యానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాటులో చోరీ జరిగింది. తాళం విరగగొట్టి లోనికి ప్రవేశించిన ఆగంతకులు మూడు తులాలు బంగారం, ఐదు తులాలు వెండి అపహరించారు. వివరాలివి.. ఈ ఫ్లాట్‌లో ఉంటున్న కున్నిశెట్టి నాలుగు నెలల కిందట ఊరుకు వెళ్లారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి ఫ్లాట్ తలుపులు తెరచి ఉండడంతో ఆమెకు అపార్ట్‌మెంట్ వాసులు ఫోన్‌లో సమాచారమిచ్చారు. దీంతో అక్కయ్యపాలెంలో ఉంటున్న తన స్నేహితురాలు అంగులూరి జ్యోతికి విషయం తెలిపింది. ఆమె సోమవారం వచ్చి చూడగా బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు మాయమైనట్టు గుర్తించారు. ఈమేరకు అందిన ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

'జగన్ మళ్లీ గెలిస్తే భవిష్యత్తు శూన్యం'



గ్యాస్ అందిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఫిబ్రవరి 19 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే మన పిల్లల భవిష్యత్‌ను మనమే ఉరేసినట్లు అవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉజ్వల 2.0 పథకం ద్వారా లబ్ధిదారులకు గ్యాస్ స్టవ్‌లను సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. దీనిలో భాగంగా నియోజకవర్గానికి సంబంధించిన 70 మంది లబ్ధిదారులకు గ్యాస్ స్టౌలను అందించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, రాంబాబు, రమణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్‌కు సత్కారం



సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 19 : తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్ ఐ.భాస్కరరావును, ప్రిన్సిపాల్ ఐ.సునీతను రోటరీ క్లబ్ పోర్టు సిటీ జిల్లా గవర్నర్ ఆర్వీ సుబ్బారావు, అధ్యక్షుడు ఆర్. రామకృష్ణారావు, కార్యదర్శి ఎన్ఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రోగుల సహాయార్థం పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరావు సమక్షంలో విద్యార్థులు రూ.56 వేలను అందించారని చెప్పారు.

45 పడకలతో హ్యాపీహోమ్ డార్మెటరీ ప్రారంభం



ప్రారంభోత్సవంలో సీపీ, అధికారులు

మహారాణిపేట, ఫిబ్రవరి 19: నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన డార్మెటరీతోపాటు, ఆధునీకరించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ ఇతర పోలీస్ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. నగరంలో బందోబస్తు విధులతోపాటు ఇతర పనులపై వివిధ చోట్ల నుంచి వచ్చే సిబ్బందికి వసతి కల్పించేందుకు వీలుగా నిర్మించిన 'హ్యాపీ హోమ్' భవనాన్ని నిర్మించారు. ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం ఆవరణలో పునర్నిర్మించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని రిజర్వు ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు చేతులు మీదుగా ప్రారంభింపజేశారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ, అధికారులు పాల్గొన్నారు.

గుడికి వైసీపీ నేత తాళం!



తాళం వేయడంతో ఆలయవెలుపలున్న భక్తులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు సత్యసాయి నగర్‌లోని విజయ దుర్గ ఆలయానికి వైసీపీ నేత ఒకరు సోమవారం తాళం వేసి వెళ్లిపోయారు. ఏటా ఇక్కడ ఫిబ్రవరి 20 నుంచి 22 వరకు అమ్మవారి ఉత్సవం జరుగుతుంది. ఆలయ ధర్మకర్త దీనిని నిర్వహిస్తారు. రెండేళ్ల నుంచి ఆయన పలు కారణాలతో నిర్వహించలేకపోవడంతో అదే వంశంలో మరొకరు ముందుకు వచ్చారు. అది ఇష్టం లేని స్థానిక వైసీపీ నాయకుడు రాజు ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. దాంతో సోమవారం జరగాల్సిన గణపతి హోమం ఆగిపోయింది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు విష్ణుకుమార్ రాజు డిమాండ్ చేశారు.

జగన్‌ను గద్దె దించేందుకు జనం సిద్ధం

» శంఖారావం సభలో ఎమ్మెల్యే గంటా.శ్రీనివాసరావు » ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు అసెంబ్లీ సీట్లు వచ్చే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు



జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

మురళీనగర్, ఫిబ్రవరి 19 ; ముఖ్యమంత్రి జగన్ పార్టీని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు గంటా.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బిర్లా జంక్షన్‌లోని హ్యుందాయ్ షోరూం గ్రౌండ్స్‌లో జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉమ్మడి మూడు జిల్లాల్లో కనీసం మూడు సీట్లు గెలుస్తామని చెప్పే ధైర్యం కూడా నేడు వైసీపీ నాయకులెవరూ చేయలేకపోతున్నారని ఆయన అన్నారు. జగన్ మహా భారతంలో అర్జునుడిలా తనకు తాను భావిస్తున్నా, వాస్తవానికి ఆయనది దుర్యోధనుడి పాత్ర అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కృష్ణార్జునులై.. 2024 ఎన్నికల సంగ్రామాన్ని గెలిచి చూపిస్తారన్నారు. పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ముతుకుపల్లి భరత్ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ కార్యక్రమాలనుపటిష్ఠంగా అమలు చేస్తున్న వారిని లోకేశ్ ప్రత్యేకంగా సత్కరిస్తున్నారన్నారు. ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్... తనకుతాను పేదవాడినని, పెత్తందార్లతో యుద్ధం చేస్తున్నానంటూ పొంతన లేని మాటలు చెబుతున్నారని భరత్ విమర్శించారు. విశాఖలో సరైన అభివృద్ధి లేక నగర యువత మద్యానికి గంజాయికి బానిసలయ్యే దుస్థితిని వైసీపీ పాలకులుతీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం చేతకాని పాలనకు టీడీపీ.జనసేన ఐకమత్యంతో బుద్ధి చెప్పాలన్నారు. సభలో జనసేన నార్త్ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్ మాట్లాడుతు, నియోజకవర్గంలోపలు వార్డులతోపాటు కొండవాలు ప్రాంతాల ప్రజలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారన్నారు. ఎన్నికల్లో బూటకపు హామీలతో గద్దెనెక్కిన జగన్ జె-బ్రాండ్ మద్యం విక్రయాలతో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. అలాగే, అశేష జనవాహిని మధ్య ఈ జరిగిన విశాఖ నార్త్ శంఖారావం పార్టీ శేణుల్లో జోష్ నింపింది. 50వవార్డు పార్టీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో జనాలు వచ్చారు.

శంఖారావం సభకు తరలిన పార్టీ శ్రేణులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 19: బిర్లా జంక్షన్‌లో సోమవారం జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 80అడుగుల రోడ్డు నుంచి కార్యకర్తలు ర్యాలీ గా వెళ్లారు. అలాగే, లోకేశ్‌ను వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. 44వ వార్డు అధ్యక్షుడు కాళ్ల గౌరీ శంకర్‌నాయుడు, మోహనరావు, పందిరిపల్లి శ్రీను, రేపటి శివ, రాజు, ఖుసిడ, షేక్ సోనా, గులాబ్ తదితరులు పాల్గొన్నారు. 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు ఆధ్వర్యంలో లోకేశ్ సభకు నాయకులు వెళ్లిలోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.నాయకులు రాజగిరి కన్నారావు, ఆరేపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు. తాటిచెట్లపాలెం నుంచి తెలుగు మహిళా రాష్ట్ర నేత ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నాయకులు జి.వీరుబాబు, ఎం. అప్పలనాయుడు, ఇ.ఈశ్వరరావు, బి.శ్రీకాంత్, ఎం.దేవి, డి.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: 54వ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. పెంటకోట త్రినాధ్,ఉప్పాడ శేఖర్,ఆదినారాయణ,రమణ ఉన్నారు.



సభా ప్రాంగణంలో టీడీపీ నేత కొయిలాడ వెంకటేశ్వరరావు, కార్యకర్తలు

14వ వార్డునుంచి..

సీతమ్మధార: గ్రేటర్ 14వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంప ధర్మారావు ఆధ్వర్యంలో లోకేశ్ శంఖారావం సభకు వార్డు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. ధర్మారావు లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉత్తరం ఇన్‌చార్జిగా నియమించాలని కృష్ణ వినతి

ఉత్తరనియోజకవర్గ టీడీపీసమన్వయకర్తగా తనను నియమించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కోరారు. ఈమేరకు బిర్లా జంక్షన్‌లో జరిగిన సభలో ఆయనను కలిసి వినతిపత్రమిచ్చారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

» టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ

మహారాణిపేట, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో అభివృద్ధి గాలికి వదిలేసి ఎదుటి వారిపై విమర్శలు చేయడం వైసీపీ నేతలు మానుకోవాలని టీడీపీ సౌత్ ఇన్‌చార్జి గండి బాబ్జీ హితవు పలికారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియాలంటే ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టులు వచ్చాయి, ఉపాధి, తదితర అంశాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. దేశంలో సుదీర్ఘ అనుభవం, విజన్ ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన చంద్రబాబుపై విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. పాలనలో జగన్, చంద్రబాబుకు ఎంతో తేడా ఉందన్నారు. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో రూ.11 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల నెత్తిన భారం మోపినట్టు ఆరోపించారు. పెట్టుబడుల సదస్సులో 99 ఒప్పందాలు చేసుకున్న వాటిలో ఎన్ని కంపెనీలు ప్రారంభించారని ప్రశ్నించారు. ఉద్యోగులకు బకాయిలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు, యువతకు ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఈసందర్భంగా హెచ్చరించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం పాల్గొన్న సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి అత్యంత హేయమైనదన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను మోసగించిన సీఎం. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల కబ్జా చేయడమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న గండి బాబ్జీ

ఉక్కు భూముల అమ్మకానికి మళ్లీ వేలం

దరఖాస్తులకు మార్చి 5 వరకు గడువు .. 14, 15 తేదీల్లో వేలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉక్కు కర్మాగారం విక్రయంపై ఎటువంటి అడుగులు ముందుకుపడడం లేదని చెబుతున్న కేంద్రం ఇక్కడి భూములను మాత్రం వేలం వేసి అమ్మడానికి మరోసారి ప్రకటన విడుదల చేసింది. నగరంలోని హెచ్‌బీ కాలనీ, పెదగంట్యాడ, ఆటోనగర్‌లలో సిబ్బంది క్వార్టర్లు ఉన్నాయి. అవి పాడుబడిపోవడంతో ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించారు. నేషనల్ మోనటైజేషన్ కార్పొరేషన్ నేతృత్వంలో నేషనల్ బిల్డింగ్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్ భూములను విక్రయించే బాధ్యతను చేపట్టింది. గతంలో గుత్తగా అమ్ముతామని ప్రకటించగా ఇప్పుడు ప్లాట్ల వారీగా ఇచ్చేస్తామని ప్రకటించారు. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అదే నెలలో 14, 15వ తేదీలలో ఈ-వేలం వేస్తారు.

- హెచ్‌బీ కాలనీలో 22.9 ఎకరాల్లో ఉన్న 588 ప్లాట్లు (45 ల్యాండ్ పార్శిళ్లు).
- పెదగంట్యాడలో 2 ఎకరాలలోని 76 ఇళ్ల స్థలాలు (4 ల్యాండ్ పార్శిళ్లు).
- ఆటోనగర్‌లో 8 ఇళ్లు (ఒక ల్యాండ్ పార్శిల్) అమ్మకానికి పెట్టారు. వీటి ద్వారా వేయి కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సమస్యలపై వాసుపల్లి వినతి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 19: దక్షిణ నియోజకవర్గంలో సమస్యలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ సోమవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కలిసి వినతి పత్రమిచ్చారు. ప్రసాద్ గార్డెన్స్‌లో 388 జీవో ప్రకారం ఇళ్లపట్టాల సమస్య, అంగడి దిబ్బ ఇళ్ల స్థలాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

తరువాత పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం వెళ్లిపోయారు.

పేర్లు ఖరారయ్యారంటూ ఊహాగానాలు

పార్టీ అధినేతతో పలువురు సమావేశమైన సందర్భంగా కొందరికి స్పష్టమైన భరోసా లభించిందని, వారికి పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారంటూ సోషల్ మీడియాలో కొందరి పేర్లు షికారు చేశాయి. విశాఖ జిల్లాలో ఇద్దరికి, అనకాపల్లి జిల్లాలో ఇద్దరికి ఫలానా స్థానాలు అంటూ ప్రచారం చేశారు. అయితే ఎవరి పేర్లు ఖరారు చేయలేదని, ఆ ఊహాగానాలు నమ్మవద్దని పార్టీ నాయకులు పలువురు స్పష్టంచేశారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

సీతమ్మధార, ఫిబ్రవరి 19 : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనభ్యసించి అనుకున్న లక్ష్యాలను అధిరోహించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విద్యార్థులకు సూచించారు.ఎస్ఎఫ్ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు ఆయనఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగించారు. ఉన్నత విద్యనభ్యసించడం వల్ల భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. అనంతరం విద్యార్థినుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీ జోసెఫ్, ప్రిన్సిపాల్ పి.మనోజ్, పి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాసేలా సిద్ధంచేయండి

జ్ఞానాపురం, ఫిబ్రవరి 19 : వార్షిక పరీక్షల్లో ప్రశాంతంగా రాసేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ కోరా రు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సారథ్యంలో సోమవారం జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోజిల్లాలో అన్ని పాఠశాలల యాజమాన్యాల సారథ్యంలో పరీక్షలు రాయనున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్లతో పరీక్ష పే చర్చ 2024 పేరిట నిర్వహించిన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. కమిషన్ కో ఆర్డినేటర్ కె.చిట్టిబాబు, డీఈవో ఎల్. చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి ఎ.గౌరీశంకరరావు, ఏపీసీ శ్రీనివాస్, డీసీపీయూపీ ఓబీసీ రమేష్, డైట్ భీమిలి లెక్చరర్ త్రినాధరావు, సారిపల్లి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీషా బేగంఉన్నారు.

కేజీహెచ్‌లో అడ్డగోలుగా ఉద్యోగాలు

- పారా మెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ లేకపోయినా కొందరికి ఉద్యోగాలు కల్పన
- కొవిడ్ సమయంలో పని చేసినట్టుగా తప్పుడు పత్రాల సమర్పణ
- ఈ జాబితాలో ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, రేడియో గ్రాఫర్లు
- ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మరింత వెలుగులోకి వచ్చే అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో పలువురు అడ్డగోలుగా ఉద్యోగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పత్రాలు సమర్పించి మరీ పలువురు ఉద్యోగాలు సాగిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. వీరిలో స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు ఉన్నట్టు చెబుతున్నారు. సదరు సిబ్బంది వ్యవహారాన్ని పలువురు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. 2022-23 మధ్య కాలంలో కేజీహెచ్‌లో పలు పోస్టులను భర్తీ చేశారు. ఈ పోస్టుల భర్తీలో పాటించాల్సిన నిబంధనలకు విరుద్ధంగా పలువురికి ఉద్యోగాలను కల్పించారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేరాలంటూ తప్పనిసరిగా బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఒకేషనల్ ఎంఎల్‌టీ కోర్సుల్లో ఏదో ఒకటి పూర్తి చేయడంతోపాటు పారా మెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) పూర్తి చేసిన వారికి క్లినికల్ శిక్షణ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకేషినల్ ఎంఎల్‌టీ పూర్తి చేసిన వాళ్లు కనీసం ఏడాదిపాటు వంద పడకల ఆస్పత్రిలో పని చేస్తేనేగానీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఐదేళ్లకోసారి రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, కేజీహెచ్‌లోని ల్యాబ్ టెక్నీషియన్లుగా ఉద్యోగాలు పొందిన పలువురుఆస్పత్రుల్లో శిక్షణ లేకుండానే రిజిస్ట్రేషన్లను అడ్డగోలు చేయించుకున్నారు. ప్రస్తుతం రెన్యువల్‌కు వెళ్లిన దరఖాస్తులను శిక్షణ పొందిన ఆస్పత్రులకు పారామెడికల్ బోర్డు పంపిస్తోంది. ఆయా ఆస్పత్రులు నుంచి సరైన స్పందన లేకపోవడంతో రెన్యువల్ చేయడం లేదు. రెన్యువల్ కాకపోయినప్పటికీ వారంతా ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. మొదట్లో పారామెడికల్ బోర్డులో ఎలా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారో గానీ, ఇప్పుడు రెన్యువల్ చేయించుకోలేక ముప్పుతిప్పలు పడుతున్నారు. మరోవైపు రెన్యువల్ పత్రాలు ఇవ్వాలంటూ ఆస్పత్రి అధికారులు అడుగుతుండడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నట్టు తెలిసింది. మరోవైపు ఒకేషనల్ ఎంఎల్‌టీ పూర్తి చేసి డీఎంఎల్‌టీ, బీఎస్ ఎంఎల్‌టీ పూర్తి చేసిన అభ్యర్థులు కొందరు ఉన్నారు. కేజీహెచ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసినప్పుడు ఎంఎల్‌టీ ఒకేషనల్ చేసి.. అప్రెంటీస్ చేయకుండానే మరికొందరు ఉద్యోగాలు పొందారు. దరఖాస్తు సమయంలో ఒకేషినల్ సర్టిఫికెట్లు చూపించి(మార్కులు అధికంగా ఇస్తారని), సర్టిఫికెట్లు పరిశీలన సమయంలో మాత్రం బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ చూపించి ఉద్యోగాలు పొందినట్టు చెబుతున్నారు. కొవిడ్ సమయంలో పనిచేసినట్టుగా పత్రాలను చూపి మరికొందరు ఉద్యోగాలు పొందారు. వీరిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నట్టు చెబుతున్నారు. రేడియో గ్రాఫర్ పని చేస్తున్న వారిలో కూడా ఇటువంటి వ్యక్తులు ఉన్నట్టు చెబుతున్నారు. ఉద్యోగంలో చేరే సమయానికి సర్టిఫికెట్లు ఉండాలి. కానీ, లేకపోయినప్పటికీ ఉద్యోగాలుకల్పించినట్టు చెబుతున్నారు. వీరిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పక్కదారి

... 5వ పేజీ తరువాయి

పూర్తిచేసిన విషయం రెండు రోజుల కిందట బయటపడిన విషయం తెలిసిందే.

జాతీయ రహదారికి జీవీఎంసీ నిధులు వెచ్చించడంపై అనుమానాలు

తగరపువలస నుంచి లంకెలపాలెం వరకూ సుమారు 70 కిలోమీటర్లు విస్తరించి ఉన్న జాతీయ రహదారి ప్రస్తుతం భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆధీనంలో ఉంది. నగరం మధ్య నుంచి ఉండడంతో సుందరీకరణ కోసం సెంటర్ మీడియన్‌లో మొక్కలు పెంపకం బాధ్యతను మాత్రమే జీవీఎంసీ తీసుకుంది. రోడ్డు నిర్వహణ బాధ్యతలు మాత్రం ఎన్‌హెచ్ఏఐ చూసుకుంటోంది. రోడ్డుపై గుంతలుపడినా, మరమ్మతులు చేయాల్సి వచ్చినా ఎన్‌హెచ్ఏఐ మాత్రమే చేస్తోంది. అందువల్లనే అగనంపూడి వద్ద టోల్‌గేట్ పెట్టి మరీ వాహనాల నుంచి టోల్‌గేట్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో నార్త్ స్టార్ హోమ్స్ నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ దాదాపు రూ.కోటి వెచ్చించి జీవీఎంసీ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందనేది అర్థం కావడం లేదు.

పోనీ రోడ్డు నిర్మాణ పనులైనా సరిగా చేశారా?...అంటే అదీ లేదు. సాధారణంగా జాతీయ రహదారిపై కొత్తగా బీటీ లేయర్ వేయాల్సి వస్తే ప్రస్తుతం ఉన్న లేయర్‌ను యంత్రాలతో పూర్తిగా తొలగించి, డెబ్రిస్‌ను యార్డుకు తరలిస్తారు. తర్వాత రోడ్డును శుభ్రం చేసి, ఆ తర్వాత హాట్‌మిక్స్‌తో బీటీ లేయర్ వేస్తారు. తర్వాత శక్తివంతమైన హైడ్రాలిక్ రోలింగ్ యంత్రాలతోరోలింగ్ చేస్తారు. దీనివల్ల రోడ్డు మన్నిక ఉంటుంది. కానీ హనుమంతవాక జంక్షన్ వద్ద రోడ్డు నిర్మాణంలో ఏమాత్రం నాణ్యత కనిపించడం లేదు. కనీసం జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టిలో పెట్టి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేశారా?, లేదా? అనే చర్చ జరుగుతోంది. అధికారులు తమ కమీషన్ల కోసం ఇలాంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున కమిషనర్ దీనిపై దృష్టిసారించిబాధ్యులైనవారిపై చర్యలుతీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

విశాఖను గుండెల్లో పెట్టుకుంటాం

... 5వ పేజీ తరువాయి

పరిధిలోని లంకా మైదానంలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. రెండు నెలల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాబోతోందని, విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి దాటేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫుట్‌బ్రిడ్జిలు నిర్మిస్తామని, కరాస వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. విశాఖ ఉత్తరం నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధే తప్ప కొత్తగా చేసిందేమీ లేదని లోకేశ్ అన్నారు. వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు నియోజకవర్గంలో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు నగరంలో పలుచోట్ల భూములు ఆక్రమించుకున్నారన్నారు. ఎంతో ప్రశాంతమైన విశాఖలో అశాంతి కలిగేలా వైసీపీ నేతలు వ్యవహరించారని లోకేశ్ ఆరోపించారు. మర్డర్లు, కిడ్నాప్‌లు, భూకబ్జాలు, గంజాయి అమ్మకాలకు నగరం కేంద్రంగా మారిందన్నారు.

గాజువాక ప్రాంతం మినీ ఇండియా అని లోకేశ్ అభివర్ణించారు. విశాఖ ఉక్కు కర్మాగారం, భెల్, హెచ్‌పీసీఎల్, గంగవరం పోర్టు వంటివి ఇక్కడ ఉన్నాయని పేర్కొంటూ దేశం నలుమూలల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తేఅగనంపూడి టోల్‌గేటు ఎత్తివేతకు ప్రయత్నిస్తామన్నారు. గంగవరం పోర్టు బాధితులను ఆదుకుంటామని, ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని, గంగవరం పోర్టు కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గాజువాక పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా ఫ్రైట్ కారిడార్‌తోపాటు ఫ్లైవోవర్లు ఏర్పాటుకు కృషిచేస్తామని, గంగవరం మత్స్యకారుల కోసం జెట్టీకి బ్రేక్ వాటర్ ఏర్పాటుచేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గాజువాక నియోజకవర్గాన్ని పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించి, 19వేల మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలోఅన్ని కులాలు, మతాలకు సంక్షేమ పథకాలు అందించామని, సామాజిక భవనాలు నిర్మించామని చెప్పారు.

ఉక్కు భూములు ఎవరు కొన్నా వెనక్కి తీసుకుంటాం.....

విశాఖ ఉక్కు కర్మాగారం భూములు అమ్మకానికి ఏపీలో కాకుండా హైదరాబాద్‌లో పేపర్‌లో ప్రకటన జారీచేసినట్టు ఇప్పుడే సెల్‌ఫోన్‌లో చూశానని లోకేశ్ అన్నారు. ఉక్కు కర్మాగారం భూములు ఎవరు కొనుగోలు చేసినా అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటామని, ఈ విషయం కొనుగోలు చేసే వ్యక్తులు గుర్తుంచుకోవాలన్నారు.ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సమస్యపై ఎప్పుడైనా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడారా?...అని ప్రశ్నించారు. చివరకు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోరాడితే ఆయన్ను వేధించి షాపింగ్ కాంప్లెక్స్ కూలగొట్టారని ఆరోపించారు. పది రోజుల నుంచి ఉత్తరాంధ్రలో చేపట్టిన యాత్రకు భారీగా స్పందన వచ్చిందని లోకేశ్ అన్నారు. ఇక్కడ ప్రజల జీవితాలతో వైసీపీ నాలుగేళ్ల పది నెలలుగా ఆడుకుందని ఆరోపించారు. జగన్‌ను ప్రజలు ఫుట్‌బాల్ ఆడుకునే సమయం రెండు నెలల్లో రాబోతోందన్నారు. సభలలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్, చిక్కాల విజయ్, ముత్యాలనాయుడు, లొడగల కృష్ణ, ముక్కా శ్రావణి, పోలమరశెట్టి శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, మొల్లి ముత్యాలు, పులి లక్ష్మీబాయి, రౌతు శ్రీనివాసరావు, నల్లూరి సూర్యనారాయణ, ప్రసాదుల శ్రీనివాస్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, జనసేన నాయకులు కోన తాతారావు, ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

22న ఉప రాష్ట్రపతిరాక

... 5వ పేజీ తరువాయి

మేరీటైమ్-2024 సెమినార్‌ను ప్రారంభిస్తారు. సెమినార్ అనంతరం 12.55 గంటలకు ఐఎన్ఎస్ డేగా నుంచి బయలుదేరి ఢిల్లీ వెళతారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీలో బయలుదేరి 3.15 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ చోళాకు వెళతారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం నాలుగు గంటలకు సముద్రిక ఆడిటోరియంకు చేరుకుని మిలాన్ వేడుకలు ప్రారంభిస్తారు. తిరిగి ఐఎన్ఎస్ చోళాకు చేరుకుని రాత్రి 7.15కు నేవీ అధికారులు ఇచ్చే విందుకు హాజరవుతారు. 22వ తేదీ ఉదయం 9.30కు బయలుదేరి జగదల్‌పూర్ వెళతారు.

కేజీహెచ్‌లో మరో పిల్లల ఐసీయూ వార్డు : కలెక్టర్

మహారాణిపేట, ఫిబ్రవరి 19: కేజీహెచ్‌లో ఆధునిక వసతులతో మరో పిల్లల ఐసీయూ వార్డును అందుబాటులోకి తీసుకురానున్నట్టు కలెక్టర్ ఏ మల్లికార్జున తెలిపారు. సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా కేజీహెచ్‌లో పర్యటించి పిల్లల వార్డును తనిఖీ చేశారు.అక్కడ అందుతున్న సేవలపై చిన్నారులు, మహిళలతో మాట్లాడి తెలుసుకున్నారు. పిడియాట్రిక్ సాధారణ వార్డును ఐసీయూ వార్డుగా మార్పులో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, వైద్యాధికారులున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో 'స్పందన'కు 140 అర్జీలు

మహారాణిపేట, ఫిబ్రవరి 19: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అన్ని శాఖల విభాగ అధిపతులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఏ మల్లికార్జున ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు 140అర్జీలు స్వీకరించి ఆయన మాట్లాడారు.డీఆర్‌వో కే మోహన్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

భీమిలీ తీరాన విజయసాయి రెడ్డి కుటుంబం కబ్జా: జనసేన

విజయసాయి రెడ్డి కుటుంబ సభ్యులు భీమిలీ టౌన్ పరిధి సముద్ర తీర ప్రాంతంలో అవియాన్ రియాల్టీ పేరిట హస్తగతం చేసుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఈమేరకు ఆయనస్పందనలో ఫిర్యాదు చేశారు.

పోలీసు కమిషనరేట్‌కు 42 ఫిర్యాదులు

పోలీసు కమిషనరేట్‌లో జరిగిన స్పందనలో 42 ఫిర్యాదులను స్వీకరించినట్టు ఏడీసీపీ ఎంఆర్‌కే రాజు తెలిపారు.

గాజువాక, పెందుర్తిలకు వైసీపీ పరిశీలకుల నియామకం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం గాజువాక, పెందుర్తి నియోజకవర్గాలకు కొత్తగా పరిశీలకులను నియమించింది. గాజువాక నియోజకవర్గం పరిశీలకుడిగా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పెందుర్తి పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డిని నియమించారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకులతో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి రెండు రోజుల కిందట ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరినీ పరిశీలకులుగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అలాగే అనకాపల్లి నియోజకవర్గం పరిశీలకుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్‌ను పశ్చిమ నియోజకవర్గానికి మార్చారు. భీమిలి నియోజకవర్గానికి మాజీ మంత్రి పి. బాలరాజు, తూర్పు నియోజకవర్గానికి మొల్లి అప్పారావు, దక్షిణ నియోజకవర్గానికి వీసం రామకృష్ణ, ఉత్తర నియోజకవర్గానికి చిక్కాల రామారావు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎన్నికలకు ముందు ఫొటోగ్రాఫర్‌పై దాడి ట్రయలా?

- హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసి వైసీపీ రౌడీమూకలు కిరాతంగా కొట్టి హింసించడం రానున్న ఎన్నికలకు ట్రయల్ అనుకోవాలా అని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజల ముందుకు తెస్తున్న మీడియాపై దాడి జరగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

దాడికి ఖండన

డాబాగార్డెన్స్: అనంతపురం జిల్లా రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ బి.శ్రీకృష్ణపై దుండగులు మూకుమ్మడిగా దాడి చేయడాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ విశాఖ జిల్లా యూనిట్లు తీవ్రంగా ఖండించాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు , ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పైడి దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని ఖండించిన వారిలో ఏపీబీజేఏ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి ఎస్.అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, కోశాధికారి బి.సీతారామమూర్తి ఉన్నారు.



తగరపువలసలో ఇటీవల ప్రారంభించిన రైతు బజారు



రైతుబజారు లోపల నిర్మించిన దుకాణాలు

బజారు సరే.. రైతులేరి?

- తగరపువలసలో అట్టహాసంగా ప్రారంభం
- ఎన్నికల సమయం కావడంతో వైసీపీ నాయకుల హడావుడి
- అధికార పార్టీ తీరుపై స్థానికుల విస్మయం

తగరపువలస, ఫిబ్రవరి 19 : తగరపువలస, చిట్టివలస ప్రాంతీయులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతు బజారును ప్రభుత్వం ఎట్టకేలకు ప్రారంభించింది. అయితే ఇందులో రైతులకు ఇప్పటివరకు దుకాణాలు కేటాయించలేదు. దీంతో అమ్మకాలు జరగక దుకాణాలన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. నగర పరిధిలో ఉన్న రైతుబజార్లలో దుకాణాలను అమ్మకందారులను కేటాయించేటప్పుడు అధికారులు కొన్ని నిబంధనలు పాటిస్తుంటారు. రొటేషన్ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తుంటారు. అయితే నిత్యం అమ్మకాలు జరిగే సిటీ రైతుబజార్ల నుంచి రైతుల్ని ఇక్కడికి తీసుకువస్తే వస్తారో రారోనన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో ఇక్కడికి సమీపంలో సంతలో కూరగాయలు అమ్మేవారిని తరలిస్తే సంతకు దీనికి తేడా ఉండదని అంటున్నారు. పరిసర ప్రాంతాల్లో కూరగాయలు సాగు చేసే రైతులను ఎంపిక చేసే కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖలు సంయుక్తంగా చేపట్టాల్సి ఉంది కానీ ఇంత వరకు అటువంటి ప్రయత్నాలేవీ కనిపించడం లేదు. దుకాణాల కేటాయింపు తరువాత ధరలను ప్రకటించి ఆ ప్రకారం అమ్మకాలు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ఎస్టేట్ అధికారిని కూడా నియమించాల్సి ఉంది. అలాగే రైతుబజారులో చిన్న షెడ్లు నిర్మించారు. వీటికి అనుబంధంగా మరికొన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉంది. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం, కూరగాయల అమ్మకాలు తరువాత నిల్వ చేసుకునే షెడ్‌లను కూడా నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం మెయిన్ రోడ్డులో సంతకు అమ్మకందారులు కొనుగోలుదారులు అలవాటు పడి ఉన్నారు. ఈమేరకు కొన్ని నిబంధనలు మార్చాల్సి. కానీ ఇవేవీ లేకుండానే వైసీపీ నేతలు ఎన్నికల నేపథ్యంలో హడావిడిగా రైతుబజారును ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఫిబ్రవరి 19 : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శివశక్తినగర్ ఫీడర్ మరమ్మతు పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. శివశక్తినగర్‌రోడ్డు, అయ్యప్పనగర్, వైఎస్సార్ కాలనీ, గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి, కార్పెంటర్స్ కాలనీ, దివ్యాంగుల కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని కైలాసగిరి 11 కేవీ ఫీడర్, హనుమంతవాక రోడ్డు నుంచి కైలాసగిరి రోడ్డు మార్గంలో జీవీఎంసీకి సంబంధించిన ఫుట్ వర్క్ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.ఆదర్శనగర్, తోటగరువు, హనుమంతవాక, విజయదుర్గా కాలనీ, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ,బీఎన్ ఆర్‌నగర్, తోటగరువు, కైలాసగిరి రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

ఐద్వా మహాసభలు పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ, ఫిబ్రవరి 19 : నగరంలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే ఐద్వా మహాసభలను మహిళలు విజయవంతం చేయాలని మధురవాడ జోన్ ఐద్వా కార్యదర్శి బి. భారతి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభల సందర్భంగా గురువారం నగరంలోని సరస్వతి పార్కు నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సెంట్రల్ పార్కు వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

పూడికతీత పరిశీలించిన జడ్సీ

తగరపువలస, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ రెండో వార్డు జీరుపేట కాలువల్లో పూడికతీతలను జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి సోమవారం పరిశీలించారు. డ్రైనేజీలు పూడికలతో ఉన్నాయని వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో ఆమె పలు కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ చెరువు పనులు సరిగ్గా జరగడం లేదని, చెరువు ఎంత విస్తీర్ణంలో ఉంది, ఎంతమేర ఆక్రమణలు జరిగాయన్నది తెలుసుకుంటానన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, వైసీపీ నాయకులు ఎల్లయ్యరెడ్డి, గణేష్‌రెడ్డి, బాబాయిరెడ్డి, జీరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

స్పందనకు ఒకే ఒక వినతి

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఒకే ఒక వినతి అందినట్టు జోనల్ కమిషనరు కనక మహాలక్ష్మి తెలిపారు.తగరపువలసకు చెందిన మహిళ తాను నివశిస్తున్న ఇంటి స్థలానికి పట్టా మంజూరు చేయాలని విన్నవించారు.వినతిని జడ్సీ యూసీడీ విభాగానికి పంపించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : బీచ్ రోడ్డు మార్లిన్ కే రెస్టారెంట్ నుంచి తొట్లకొండ వరకూ సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు లెడ్ స్ట్రిప్స్ సీరియల్ లైటింగ్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. నగరంలోని అన్ని వార్డుల్లోనూ రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు రోప్ లైటింగ్స్ ఏర్పాటు చేసి జీవీఎంసీ అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. నగరం నుంచి తొట్లకొండ వరకూ వున్న సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు లైట్లు ఏర్పాటు చేసినా అవి సక్రమంగా వెలగడం లేదు. అలాగే నాలుగో వార్డులో తొట్లకొండ నుంచి భీమిలి వరకూ కూడా సెంట్రల్ లైటింగ్ పోల్స్ ఏర్పాటు చేసి, స్ట్రిప్ లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా శివాజీ జయంతి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 19 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఛత్రపతి శివాజీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దపట్టం, తదితరులు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21,టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారేట్ 24, దొండకాయలు 40, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబటి 28, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, క్యాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 42, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	118
ఫారం ధర	--	138
విత్ స్కిన్	--	246
స్కిన్‌లెస్	--	256

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అప్పన్నను దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, ఫిబ్రవరి 19 : వరాహలక్ష్మీ నృసింహస్వామిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తి గోత్రనామాలతో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద న్యాయమూర్తి దంపతులు

సింహగిరిపై విదేశీయులు

జపాన్ దేశస్తులు వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. వారంతా శ్రీఘ్ర దర్శనం (రూ.100) టికెట్లు తీసుకుని స్వామిని దర్శించుకుని ఉచిత ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులతో సెల్ఫీలు దిగ డంతో పాటు సింహగిరి అందాలను తమ కెమెరాల్లో బంధించారు.

బీఆర్‌టీఎస్ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

సింహాచలం, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ 98వ వార్డు తొలిపావంచా నుంచి పాత అడివివరం కూడలి వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ కారిడార్‌లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం సింహాచలం ప్రధాన కూడలిలో జరిగిన కార్యక్రమంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. నిర్వాసితులైన 110 మందిలో కొందరికి ఆయన చేతుల మీదుగా పట్టాలు అందజేసి, మిగిలిన వారికి స్థానిక సచివాలయాల్లో అందజేస్తామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ శివన్నారాయణ, అడివివరం సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు వైసీపీ నాయకులు ఎర్ర వరంబాబు, శిరిపురపు కృష్ణ, తోమురోతు రాము, బొట్టా శ్రీను పాల్గొన్నారు.

యువతకు నచ్చేలా 'సిద్ధార్థ రాయ్'

సింహాచలం, ఫిబ్రవరి 19 : త్వరలో విడుదల కానున్న సిద్ధార్థ రాయ్ సినిమా యువతకు తప్పకుండా నచ్చుతుందని సినిమా హీరో దీపక్ సరోజ్ అన్నారు. విశాఖకు చెందిన ఆయన సోమవారం అప్పన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినిమా పూర్తిగా యూత్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు యశ్వీ రూపొందించారని, తన్వీనేగీ కథనాయికగా నటించారని చెప్పారు.

'సూపర్ సిక్స్‌తో వైసీపీలో వణుకు'

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 19 : టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీలో వణుకు తారాస్థాయికి చేరిందని మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొదల పావని అన్నారు. సోమవారం ఆమె పెంట, కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొదల గౌరీ శంకర్, తాతాజీ, బాలాజీ, రమణ, అప్పారావు పాల్గొన్నారు.

వెంకన్న తిరు వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం

సింహాచలం, ఫిబ్రవరి 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలైన పద్మావతి, అలిమేల్‌మంగా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. ఏటా మాఘమాస శుక్లపక్ష దశమి నుంచి స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు జరపడం ఆనవాయితీ. ఈమేరకు సోమవారం సాయంత్రం ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు ఆగమ శాస్త్రవిధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి రుత్విక్వరణము చేశారు. అనంతరం సమీప తోటల నుంచి సేకరించిన మృత్తిక (మన్ను)కు భూ సూక్తముతో పూజలు జరిపారు. మట్టి పాలికల్లో మట్టి వేసి వాటిల్లో నవధాన్యాలు వేసి అంకురారోపణ జరిపారు. మంగళవారం సాయంత్రం గ్రామ తిరువీధి తరువాత వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు.

కరాటేలో సంస్కృత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పద్మనాభం, ఫిబ్రవరి 19 : మండలంలోని కొత్త కొవ్వాడ సంస్కృత పాఠశాల విద్యార్థులు కరాటేలో ప్రతిభ చూపి మెరిట్ పత్రాలు సాధించారు. వారిని ఉపాధ్యాయులు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. విజయనగరం జిల్లా ఎల్. కోటలో ఈనెల 18న విక్టరీ షూటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే గ్రేడింగ్ టెస్టులో పాఠశాలకు చెందిన 14 మంది పాల్గొన్నారు. వీరిలో 8 మంది ఎల్లో బెల్ట్ సాధించగా ఇద్దరు ఆరెంజ్ బెల్ట్ సాధించారు. 4, 5 తరగతులు చదువుతున్న జనార్దననాయుడు, రాజరాజేశ్వరి అనన్యలలకు గ్రీన్ బెల్టు లభించగా 5, 6 తరగతులు చదువుతున్న జస్విత, లోసిక బ్రౌన్ బెల్టు పొందారు.

గోతుల చుట్టూ టేప్‌లు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆరిలోవ, ఫిబ్రవరి 19 : దీనదయాళపురం నుంచి పెదగదిలి జంక్షన్ వరకు యూజీడీ కోసం తవ్విన గోతుల చుట్టూ జీవీఎంసీ అధికారులు సోమవారం టేప్‌లు చుట్టారు. ప్రమాదకరంగా యూజీడీ గోతులు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఈమేరకు గోతుల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

ఎండాడ, ఫిబ్రవరి 19 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ , నాగబాబు సమక్షంలో పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో 8వ వార్డు వైసీపీ మాజీ అధ్యక్షుడు సుంకర హరిబాబు, వాలంటీరు సీరపు వంశీకృష్ణరెడ్డి జనసేన లో చేరారు. ఈమేరకు పవన్‌కల్యాణ్ వారికి తాను బస చేసిన హోటల్లో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్ర త్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు.

జీవీఎంసీకి 88 వినతులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 88 వినతులు వచ్చాయి. కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. మూడు రోజుల్లో ఆయా ఫిర్యాదులను పరిష్కరించా లని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు.

బీచ్‌లో నిర్మాణాలకు జీవీఎంసీ అనుమతి

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : బీచ్‌లో జరుగుతున్న నిర్మాణాలకు జీవీఎంసీ అనుమతి ఉందని భీమిలి జోన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు. సంబంధిత భూమి టౌన్ సర్వే నంబర్లు 1516 నుంచి 1519 వరకూ, టీఎస్ నంబర్ 1522లో కొంత భాగం వుందన్నారు. బీచ్‌లో నిర్మాణాలపై రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై టీపీవో మూర్తి శ్రీను సోమవారం వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సర్వే నంబర్లన్నీ జిరాయితీ భూములేనన్నారు. ఈమేరకు భీమిలి పురపాలక సంఘం రికార్డుల్లో పేర్కొన్నారని చెప్పారు. కొంతభాగం సముద్ర గర్భంలో ఉండడంతో వారు సీఆర్‌జడ్‌కు అనుమతికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖలు ఎన్‌వోసీలు మంజూరు చేశారన్నారు. పత్రికలో వచ్చిన కథనం మేరకు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు వేర్వేరుగా స్థలాన్ని సందర్శించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

సీపీఎస్ రద్దు చేసిన వారికే మద్దతు : యూటీఎఫ్

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 19 : ప్రభుత్వం తక్షణమే సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాయకుతో కలిసి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, జనసేన నాయకులకు సీపీఎస్ రద్దు కోసం పోస్టు కార్డులు పంపిస్తున్నట్టు చెప్పారు. ఆయా పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చాలని కోరారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం ఓపీఎస్‌పై చేసే పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉంటుందన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలని వినతి

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 19 : మండలంలోని పాండ్రంగి గ్రామంలో ఉపాధి పనులను ప్రారంభించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహంతి అప్పలరమణ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పంచాయతీలో ఐదు వేల మంది జనాభా ఉన్నారని, వారిలో 2500 మంది వేతనదారులు పని లేకుండా ఖాళీగా ఉన్నారని చెప్పారు. కురపల్లి చెరువు, పాండ్రంగిలో చిరుత చెరువు, దివాన్ని కాలువల పనులు చేపట్టడం ద్వారా వేతనదారులకు ఉపాధి కల్పించాలని కోరారు.

'చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు'

మద్దిలపాలెం, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో తోపుడు బండ్ల వ్యాపారులు ఆ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తీరుకు నిరసనగా సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి పి. వెంకటరావు మాట్లాడుతూ పిఠాపురం కాలనీ రోడ్డులో వంద మంది చిరు వ్యాపారులు తోపుడు బండ్లతో వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, వారంతా పదేళ్లుగా ఒక్కో రోజు ఒక్కో చోట సంత నిర్వహిస్తారన్నారు. వారంతా వీధి విక్రయదారుల పరిధిలోకి వస్తారన్నారు. కానీ కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇక్కడ వ్యాపారాలు చేసుకోనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం

పిఠాపురం కాలనీ కళాభారతి రహదారిపై చిరు వ్యాపారులు ప్రతి సోమవారం సంత పెట్టడం పట్ల వార్డు ప్రజలు ఫిర్యాదులు అందాయని, వారిని ప్రధాన రహదారిపై కాకుండా మరో ప్రత్యామ్నాయ స్థలంలోకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. త్వరలోనే వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని చెప్పారు. వార్డు ప్రజల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతించాల్సింది పోయి కొందరు రాజకీయం చేయడం బాధాకరమన్నారు. ఇతర ప్రాంతాల్లో తొలగించిన బడ్డీలను తిరిగి పెట్టించలేని వామపక్షాల నేతలు, వైసీపీ నేతలు కళాభారతి రోడ్డు అంశాన్ని రాజకీయం చేయడం తగదన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

పద్మనాభం, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో వైసీపీ మూకలు 'ఆంధ్రజ్యోతి ' ఫొటోగ్రాఫర్‌పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ మండల నాయకులు తెలిపారు. విధి నిర్వహణలో తమ పని తాము చేస్తున్న జర్నలిస్టులపై రాక్షసంగా దాడి చేయడం అమానుషమన్నారు. సోమవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పోలీసుల సాక్షిగా దాడి జరిగినా వారు చోద్యం చూస్తూ ఉండిపోవడం దారుణమన్నారు. వాస్తవాలు రాస్తే అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు నగేష్‌కుమార్, బీసీ సెల్ నాయకుడు ఎర్నాయుడు పాల్గొన్నారు. కాగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అమానుషమని పద్మనాభం కుంతీమాధవ స్వామి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై ఇటువంటి అఘాయిత్యాలు చేయడం అధికార పార్టీ నేతలకు తగదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలే బరితెగించి ఇలా దాడి చేస్తే పాత్రికేయులకు రక్షణ ఇంకెక్కడ ఉంటుందన్నారు. దాడికి బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'దాడులు సరికాదు '

భీమునిపట్నం : రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు అడ్డూఅదుపు ఉండడం లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని ఖండించారు. ఇంత అరాచకం జరిగినా ప్రభుత్వం నుంచి స్పందన లేదంటే పాలకులు ఎలాంటి వారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇలా బరితెగించి దాడులు ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే జర్నలిస్టుపై సీఎం సభలో దాడి జరిగినా.. పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పెదవాల్తేరు : పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వైసీపీ కార్యకర్తలు ప్రవర్తించడం సరికాదని, ఆంధ్ర జ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మత్స్యకార నాయకుడు జీవీ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికార పార్టీ నాయకులు సమన్వయం పాటించాలని కోరారు.

ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు

ఎంవీపీకాలనీ, ఫిబ్రవరి 19 : తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశంసాపత్రాలు అందించారు. నియోజకవర్గంలోని 15 క్లస్టర్లలో ఉత్తమ క్లస్టరుగా రెండో క్లస్టరును ఎంపిక చేసి, 12 వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజుకు లోకేశ్ ప్రశంసాపత్రం అందించి, అభినందించారు. అప్పలరాజు భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట క్లస్టరు పరిధిలో అత్యధికంగా లబ్ధిదారులను గుర్తించి, వారికి భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను అందించారు.



అప్పలరాజుకు సర్టిఫికెట్ అందిస్తున్న లోకేశ్, పక్కన ఎమ్మెల్యే వెలగపూడి

ఏప్రిల్ 7 నుంచి నూకాలమ్మ ఉత్సవం

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవం ఏప్రిల్ 7 నుంచి 10 వరకు నిర్వహించాలని నిర్ణయించామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డెక్కన్ శ్రీనివాసరావు, పీరుపల్లి రాజు తెలిపారు. సోమవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. 7న తొలేళ్ల ఉత్సవం, 8న అనుపోత్సవం జరుపుతామన్నారు. 9,10 తేదీల్లో పేరంటాళ్ల దుద్దు అచ్చియ్యమ్మ, పాపమ్మ పండుగలు జరుగుతాయన్నారు. విలేకరులతో మాట్లాడిన వారిలో ఉత్సవ కమిటీ కోశాధికారి రాకోతు నరసింగరావు, నాగిరెడ్డి స్వామి, అప్పికొండ బాలకృష్ణ ఉన్నారు.



అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు గీతం విద్యార్థులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 19 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు న్యూఢిల్లీలో గత వారం వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ (వాకో) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపారు. గీతంలో ఇంజనీరింగ్ చదువుతున్న అష్మా, టి. సుభాష్ కిషోర్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాలు పొందినట్టు వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు. విజయకుమార్ చెప్పారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

వైభవంగా యోగాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సాగర్‌నగర్, ఫిబ్రవరి 19 : సాగర్‌నగర్‌లోని సాగరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయంలో యోగాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణకర్త మండ వెంకట జానకిరామ్ కుటుంబ సభ్యులు, సాగరేశ్వర ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 19 : విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన ఉండడం వల్ల మంచి పౌరులుగా ఎదుగుతారని ద్వారకా పీఎస్ నేర విభాగం సీఐ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన కృష్ణా కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు నేరాలు, శిక్షలు అన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గొలుసు దొంగతనాలు, బైక్ చోరీలు, పోస్కో చట్టం, గంజాయి తదితర వాటిపై వివరించారు. నేరాలు చేసి, భవిష్యత్తు పాడుచేసుకోవద్దంటూ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాందాసు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ పదో వార్డు రవీంద్రనగర్ ఆఖరి బస్టాప్ సమీపంలో సేవా స్ఫూర్తి అసోసియేషన్ థాన్ ఫౌండేషన్ సహకారంతో మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిబిరంలో స్త్రీలకు గైనిక్ పరీక్షలు, పురుషులకు నోటి పరీక్షలు చేయనున్నారు. అలాగే 25 ఏళ్లు నిండిన మహిళలకు రొమ్ము కేన్సర్,గర్భాశయ కేన్సర్, ఇతర కేన్సర్ పరీక్షలు నిర్వహించనున్నారు.

భీమిలిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు వినూత్న రీతిలో బోధించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని పొట్టిశ్రీరాములు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో భీమిలి పట్టణ, రూరల్ మండల ఉపాధ్యాయులకు జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు డిజిటల్ విద్య అందించడంతో పాటు టీచర్లు కడా నేర్చుకోవాలన్నారు. ఎంఈఓ శివరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనతో పాటు పాఠ్య ప్రణాళికలు, డైరీ, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను క్రమం తప్పకుండా పరిశీలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జయప్రద, డైట్ లెక్చరర్ సోమయాజులు, రిసోర్స్ పర్సన్లు ఆర్. అప్పలరాజు, నజ్మా సుల్తానా, సీఆర్‌పీలు వంశీధర్, శివదయా, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ చెప్పినవన్నీ అవాస్తవాలే : వైసీపీ

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 : తగరపువలసలో జరిగిన శంఖారావం సభలో టీడీపీ నేత లోకేశ్ భీమిలి నియోజకవర్గం అభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ అవాస్తవాలేనని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నాయకులు నోటికి మాస్క్‌లు, కళ్లకు బ్లాక్ రిబ్బన్లు కట్టుకుని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, ఈ విషయమై బహిరంగ చర్చకు తాము సిద్ధమని చెప్పారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంభక్త ప్రభాకరనాయుడు, వైస్ ప్రెసిడెంట్ బింగి హరికిరణ్‌రెడ్డి, 3వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు ముక్కి కృష్ణ, నాయకులు కొంకి వెంకటేష్, ప్రగడ చంటి, అప్పికొండ బాలకృష్ణ, చందక రాజశేఖర్, కుమార్, భాను పాల్గొన్నారు.

రేపటి నుంచి బీజేపీ 'ప్రజాపోరు'

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 19 : వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈనెల 21 నుంచి 29 వరకు ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, నాయకులు పేర్రాజు, సారిక ప్రకాష్, ఎం. అప్పలరమణ ఉన్నారు.

22న డ్రగ్స్ నియంత్రణపై సదస్సు

సిరిపురం, ఫిబ్రవరి 19 : ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో ఈనెల 22న మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై వ్యతిరేకంగా సదస్సు నిర్వహించనున్నట్టు పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఓడబ్ల్యూ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ పార్టీల వైఖరిని సదస్సు ద్వారా తెలియజేస్తామన్నారు.

ఏయూను సందర్శించిన యూరోపియన్ కమిషన్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 : ఏయూను యూరోపియన్ కమిషన్ సభ్యులు సోమవారం సందర్శించారు. ముందుగా వారు ఏయూలో మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో నిర్వహిస్తున్న పరిశోధన ప్రాజెక్టుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏయూలో ఏర్పాటు చేసిన మెరైన్ మోనిటరింగ్ పరిశోధన కేంద్రం ఉత్తమ పనితీరును కనబరుస్తోందని సంతోషం వ్యక్తం చేశారు.

15వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పొరి శ్రీవిద్య, వార్డు ఇన్‌ఛార్జి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు పాల్గొన్నారు.